RNI NO. TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు   తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్: హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 215 | శుక్రవారం, 11 ఏప్రిల్, 2025 | పేజీలు: 05 | వెల: 5 రూ/-



## తెలంగాణలో మరో వారం వింత వాతావరణం

### : ఉదయం ఎండ.. మధ్యాహ్నం వాన.. రాత్రికి చలి

హైదరాబాద్ : రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో గాలిలో తేమ శాతం పెరిగి అక్కడక్కడా క్యూమిలో నింబస్ మేఘాలు ఏర్పడుతున్నాయి. మేఘాలు చల్లబడి గాలి దుమారంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గురువారం (ఏప్రిల్ 10) మధ్యాహ్నం నుంచి సాయంత్రం అంటే 3 గంటలన నుంచి 6 గంటల వరకు రైన్ అలెర్ట్ ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది.అల్పపీడన ప్రభావం తెలంగాణపై స్పష్టంగా కనిపిస్తోంది. సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అక్కడక్కడా క్యుమిలో నింబస్ మేఘాలు కమ్ముకున్నాయి. దీంతో గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని హెచ్చిరించారు. దీంతో ఈ జిల్లాల్లో వచ్చే మూడు గంటల పాటు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ.

# రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ స్కూల్ విధానం

### సి.ఎం. రేవంత్ రెడ్డి వెల్లడి

### -ఘనంగా యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభోత్సవం

హైదరాబాద్, ఏప్రిల్ 10 : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ స్కూల్ విధానం ప్రవేశపెట్టాలన్న ఆలోచన చేస్తున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారు చెప్పారు. ప్రభుత్వ విద్యా విధానంలో ప్రాథమిక స్థాయిల్లోనే అస్పష్టత ఉన్నదని గమనించి, ఆలోచన చేసి ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విధానం ప్రవేశపెట్టాలన్న ఆలోచన చేసినట్టు వివరించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా గతేడాది శంకుస్థాపన చేసిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (





YIPS ) ను ముఖ్యమంత్రి గారు ప్రారంభించారు. హైదరాబాద్ మంచిరేవులలో ఏర్పాటు చేసిన పోలీస్ స్కూల్‌ను ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి గారు మాట్లాడారు. తరువాయి భాగం 12 లో

## ప్రమాద ప్రదేశం వరకు కన్వేయర్ బెల్టు పొడిగింపు,

### -కొనసాగుతున్న సహాయక చర్యలు

### ఎస్ ఎల్ బి సి టన్నెల్ ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి వెల్లడి

నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం దోమల పెంట గ్రామంలో గల ఎస్ఎల్బీసీ సొరంగ ప్రమాద ప్రదేశంలో సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. గురువారం ఎస్ఎల్బిసి టన్నెల్ ఇన్లెట్ 1 ఆఫీస్ వద్ద ప్రమాద ప్రదేశంలో కొనసాగుతున్న సహాయక చర్యలపై సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి, నిర్వహించారు. ఎస్ఎల్బీసీ, సొరంగ ప్రమాదం సంభవించిన ప్రాంతంలో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు సహాయక బృందాలు అవిశ్రాంతంగా కృషి చేస్తు, సహాయక చర్యలను మరింత వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారని తెలిపారు. సహాయక చర్యల్లో భాగంగా ప్రమాద స్థలం వరకు కన్వేయర్ బెల్టు ను పొడిగిస్తూ తద్వారా ప్రమాద ప్రదేశంలోని మట్టిని తవ్వే ప్రక్రియ మరింత వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. టన్నెల్ లోపల నిర్విరామంగా ఐదు ఎస్కవేటర్ ల తో మట్టి తవ్వకాలు, చేపడుతూ సహాయక చర్యలకు అడ్డంకిగా ఉన్న స్టీల్ భాగాలను టన్నెల్ బయటికి తరలిస్తున్నట్లు ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి, వివరించారు. నిరంతరాయంగా వస్తున్న ఊట నీటిని అత్యధిక సామర్థ్యం గల పంపుల ద్వారా బయటకు తరలిస్తు సహాయక బృందాలు పూర్తిస్థాయిలో సమన్వయంతో సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. సహాయక బృందాలకు అవసరమైన అన్ని రకాల సహాయ సామాగ్రిని ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతున్నట్లు, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సహాయక సిబ్బందికి అవసరమైన అన్ని వసతులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చెందిన సహాయక బృందాలు ప్రతిరోజు సమీక్షలో పాల్గొంటూ చేయువలసిన సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతూ సహాయక చర్యలు వేగవంతం చేస్తున్నట్లు ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి, వివరించారు.

ఈ సమీక్ష సమావేశంలో, ఆర్మీ అధికారులు, జేపీ కంపెనీ ప్రతినిధులు, ఎస్ డి ఆర్ ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, సింగరేణి మైన్స్ రెస్క్యూ అధికారులు, హైడ్రా అధికారి, దక్షిణ మధ్య రైల్వే అధికారి, తదితరులు పాల్గొన్నారు.



### పేద మధ్యతరగతి ప్రజలపై

## భారం వేయొద్దు

### –వంటగ్యాస్ ధరల పెంపుపై రాష్ట్రవ్యాపిత నిరసనలకు పిలుపు సీపీఐ (ఎం)

హైదరాబాద్ : అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గినందున వినియోగదారులకు గ్యాస్ సిలెండర్ ధరలకు తగ్గించి ఆ ఫలితాలు అందించాలి. కానీ హాకేంద్ర బీజేపీ ప్రభుత్వం వంటగ్యాస్ సిలెండర్‌పై రు.50లు పెంచడం దారుణం. దీనివల్ల ఉజ్వల పథకం లబ్దిదారులు, సాధారణ వినియోగదారులతో పాటు, మహాలక్ష్మి స్కీం అమలు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వంపై కూడా పెద్ద భారం పడుతుంది. మోడీ ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరలను ఉపసంహరించుకోవాలని, దీనికోసం కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్రకమిటీ డిమాండ్ చేస్తున్నది. నిత్యావసర సరుకుల ధరలపై నియంత్రణ తెస్తామని చెప్పిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం, అన్ని రకాల సరుకులు, వస్తువుల ధరలను విపరీతంగా పెంచింది.

అధికారంలోకి వచ్చినప్పటి నుండి గ్యాస్ సిలిండర్ ధరలు 130.57 శాతం పెంచడంతో పాటు, సబ్సిడీని కూడా తగ్గించుకుంటూ వచ్చింది.

కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు రాయితీలిస్తూ, రాష్ట్రంలోని వినియోగదారులపై సంవత్సరానికి రు.400 కోట్ల భారం మోపుతున్నది. పెంచిన వంటగ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, రేపు, ఎల్లుండి (ఏప్రిల్ 9, 10 తేదీల్లో) రాష్ట్రవ్యాప్త నిరసనలు చేపట్టాలని పార్టీ శాఖలకు, ప్రజలకు సీపీఐ(ఎం) పిలుపునిచ్చింది.



## ప్రతి ఇంటికీ స్మార్ట్ టీవీ, ఫైబర్ కనెక్టివిటీ అందిస్తాం

**6 నెలల్లో ప్రతి ఇంటికీ స్మార్ట్ టీవీ, ఫైబర్ కనెక్టివిటీ**

హైదరాబాద్ ఏప్రిల్ 10

లోకల్ కేబుల్ ఆపరేటర్లను టీ నెక్ట్స్ లో భాగస్వామ్యం చేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. టీ– ఫైబర్ నూతన కార్యాలయాన్ని శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ ఛైర్మన్ గా శ్రీధర్ బాబు బాధ్యతలు స్వీకరించారు. టీ–ఫైబర్, టీ–నెక్ట్స్ లోగోను ఆవిష్కరించారు.

ఆయన సంగారెడ్డి శ్రీరాంపూర్ వాసులతో మాట్లాడారు. 6 నెలల్లో ప్రతి ఇంటికీ స్మార్ట్ టీవీ, ఫైబర్ కనెక్టివిటీ అందిస్తామన్నారు. టీ–నెక్ట్స్ ద్వారా స్మార్ట్ టెలివిజన్ పరిచయం చేయబోతున్నామని చెప్పారు. సమస్యల పరిష్కారానికి 'టెరా' అనే చాట్ బాట్ ను ఆవిష్కరించించామని తెలియజేశారు. టీ ఫైబర్, టీ నెక్ట్స్ సేవలు ప్రజలకు తక్కువ ధరల్లో అందిస్తున్నామని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.



## 12వ తేదీన వైన్ షాపులు బంద్

### ఏప్రిల్ 12వ తేదీన హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో వైన్ షాపులు బంద్

ఏప్రిల్ 10 నగరంలోని మందుబాబులకు బ్యాడ్ న్యూస్. ఎల్లుండి సిటీలో వైన్ షాపులు బంద్ కానున్నాయి. ఏప్రిల్ 12వ తేదీన హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా వైన్ షాపులు మూతపడనున్నాయి. ఎల్లుండి ఉదయం 6 గంటల నుండి ఏప్రిల్ 13వ తేదీ ఉదయం 6 గంటల వరకు వైన్స్ బంద్ కానున్నాయి. ఈ మేరకు హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## పూలే మార్గం అందరికీ అనుసరణీయం

### – సీఎం రేవంత్

హైదరాబాద్ : మహాత్మా జ్యోతిరావు పూలే అనుసరించిన మార్గం అందరికీ ఆచరణీయమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఫూలే 198వ జయంతి (ఏప్రిల్11) సందర్భంగా ముఖ్యమంత్రి ఆయన త్యాగాలను, సమాజానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఒక సామాన్యుడిగా మొదలై ఒక సామాజిక ఉద్యమ కెరటంగా ఎదిగిన ఫూలే జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. సామాజిక కార్యకర్తగా, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కర్త పూలే భావితరాలకు సైతం మార్గదర్శకుడని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. సమాజంలో వివక్షకు తావు లేదని, సమానత్వం ఉండాలని జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియడారు. వెనుకబడిన వర్గాలు, దళిత జనోద్ధరణకు ఆయన ఎంచుకున్న బాట, అనుసరించిన మార్గం సమాజ శ్రేయస్సును కాంక్షించే వారందరికీ స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. మహాత్మా జ్యోతిబా ఫూలే స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రభుత్వం అనేక వినూత్న ప్రజా ప్రయోజన కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రగతి భవన్ కు మహాత్మా జ్యోతిభా ఫూలే పేరు పెట్టి ప్రజా భవన్ గా మార్చడం జరిగిందన్నారు. పూలే స్ఫూర్తితోనే విద్య, ఉపాధి అవకాశాలు అన్ని వర్గాల వారికి అందించాలనే లక్ష్యంతోనే ఎస్సీ వర్గీకరణ చేపట్టడం జరిగిందన్నారు. దేశంలోనే తొలి సారిగా బీసీ కుల గణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ఆమోదించడం జరిగిందన్నారు. అంతేగాకుండా మహిళల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. మహిళా శక్తి పాలసీ ద్వారా డ్వాక్రా సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు, వారి పేరిట పెట్రోల్ బంకుల ఏర్పాటు, సోలార్ పవర్ ప్లాంట్ల కేటాయింపు, ఆర్టీసీకి అద్దె బస్సులు ఇలా ప్రతి రంగంలో మహిళలను ప్రోత్సాహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందన్నారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు అయిదు వందల రూపాయలకు గ్యాస్ సిలిండర్ పథకాలను ఇప్పటికే అమలు చేసిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పట్టాలు కూడా మహిళల పేరు మీద ఇవ్వడం జరుగుతుందన్నారు.

### వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

### – సీఎం రేవంత్ ఆదేశాలు

హైదరాబాద్ తో పాటు పలు జిల్లాల్లో వర్షాలు పడుతున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. మరో రెండు రోజుల పాటు ఓ మోస్తరు వర్షాలు వివిధ జిల్లాల్లో కురిసే అవకాశముందన్న వాతావరణ శాఖ సూచనలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు.

## పెంచిన వంటగ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలి

### సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.అబ్బాస్




హైదరాబాద్ : కేంద్ర బీజేపీ ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని, పేదలను లూటీ చేసి, కార్పొరేట్ సంస్థల జేబులు నింపే విధానాలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ ఎండి అబ్బాస్ డిమాండ్ చేశారు. వంట గ్యాస్ ధరల పెరుగుదలను నిరసిస్తూ సీపీఎం హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఐ ఎస్ సదన్ సంతోష్ నగర్ చౌరస్తా వద్ద ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి.అబ్బాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజలపై మరో భారం మోపిందని, వంటగ్యాస్ సిలిండర్ ధరలను మళ్లీ పెంచిందని విమర్శించారు. గృహ అవసరాలు వినియోగించే 14.2 కేజీల ఎల్పిజి సిలిండర్ పై రూ.50 మేర పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. ఇప్పటికే పెరిగిన నిత్యవసర సరుకుల ధరలతో సతమతమవుతున్న సాధారణ ప్రజలపై మోడీ సర్కార్ వంటగ్యాస్ ధరలను అమాంతంగా పెంచి తీవ్రమైన భారం మోపిందని విమర్శించారు. మోడీ ధరల మోతతో ప్రజలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మోడీ ప్రభుత్వం ధరలను పెంచి పేదల నడ్డి విరిచి కార్పొరేట్ సంస్థలకి లక్షల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తుందని ఆయన దుయ్యబట్టారు. మతాల పేరుతో ప్రజలని విభజిస్తూ రెండోవైపు ధరల పేరుతో ప్రజలని లూటీ చేస్తుందని ప్రజలకు ఈ విషయాలు అర్థం కాకుండా బీజేపీ నాయకులు బూటకపు మాటలు చెబుతున్నారని విమర్శించారు. భారత్ ఎగుమత్తులపై ట్రంపు పన్నులు వేస్తుంటే నోరు మెదపడానికి ధైర్యం చేయని మోడీ దేశంలో ప్రజలపై ధరల పెంచుతూ దాడి చేస్తున్నాడని అన్నారు. ఆర్థిక వ్యవస్థ కుదిలే పరిస్థితి వచ్చిందని, స్టాక్ మార్కెట్లలో ఒక రోజే 20 లక్షల కోట్ల రూపాయలు నష్టం వాటిల్లిందని దేశ సంపద తుడిచిపెట్టుకుపోయింది. ఇవన్నీ మోడీ, ట్రంప్ విధానాల వల్ల అని విమర్శించారు. ధరలు పెంచి ప్రజలనూ ఇబ్బందులకు గురి చేస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని సామాన్య ప్రజలందరూ ముక్తకంఠంతో వ్యతిరేకించాలని అన్నారు. ప్రజల బాగోగులు చూడాల్సిన ఈ ప్రభుత్వం ప్రజలపై భారాల మోపుతూ ఇబ్బందులకు గురి చేయడం అన్యాయం అన్నారు. ప్రభుత్వం వెంటనే గ్యాస్ ధరలు తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్గించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెట్రోల్, డీజిల్ పై పెట్టిన సుంకాన్ని వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలను పెద్ద ఎత్తున కలుపుకొని బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీ విటల్,ఎం శ్రావణ్ కుమార్, ఎం.మీనా, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.కిషన్, ఏ.కృష్ణ,వీ.రాంకుమార్ నాయక్,కె. జంగయ్య, ప్రజలు పాల్గొన్నారు.

మన వెలుగు
MANA VELUGU TELUGU DAILY
శుక్రవారం, 11 ఏప్రిల్, 2025

# సంపాదకీయం

## ఆక్వాను వదలని ట్రంప్ టారీఫ్‌లు

'అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా చేద్దాం, అమెరికా ఫస్ట్' నినాదాలతో అమెరికా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ తన దూకుడు స్వభావంతో వాణిజ్య యుద్ధానికి తెర లేపాడు. ఏప్రిల్ రెండవ తేదీన వాణిజ్య లోటును తగ్గించడం, దేశీయ తయారీని ప్రోత్సహించే లక్ష్యంతో వ్యాపార సంబంధ దేశాలపై ప్రతీకార సుంకాలను విధించాడు. పెంచిన సుంకాలు ఏప్రిల్6 నుండే అమలవుతాయని అమెరికా స్పష్టం చేసింది. ఈ సుంకాల వల్ల 60 పైగా దేశాలు ప్రభావితం అవుతున్నాయి. భారత్‌పై 27 శాతం, చైనాపై 34 శాతం, తైవాన్‌పై 32 శాతం, జపాన్‌పై 24 శాతం, యూరోపియన్ యూనియన్‌పై 32 శాతం, ఇతర దేశాలపై 10 శాతం సుంకాలు విధించారు. భారత్‌కు అమెరికా అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. 2024 ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు ఎగుమతుల విలువ 77.5 బిలియన్ డాలర్లు. భారత్ నుండి ఎగుమతి అయ్యే ప్రధాన వస్తువులు ఎలక్ట్రానిక్స్, రత్నాలు, ఆభరణాలు, ఫార్మా ఉత్పత్తులు, యంత్రాలు, పెట్రోలియం ఉత్పత్తులు. అయితే ఈ సుంకాల ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై గణనీయంగా పడనుంది. ముఖ్యంగా మన రాష్ట్రానికి సంబంధించిన సీ ఫుడ్స్, ఆక్వా రంగాలను తీవ్రంగా నష్టపరచనున్నాయి. రొయ్యల ఉత్పత్తిలో భారతదేశం అగ్రస్థానంలో ఉంది. 2022-23 సంవత్సరంలో భారత్ నుండి 63.969 కోట్ల విలువ కలిగిన 1.73 మిలియన్ టన్నుల మత్స్య ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. అమెరికా మత్స్య ఉత్పత్తులకు పెద్ద మార్కెట్. మొత్తం 5.6 బిలియన్ డాలర్ల విలువైన రొయ్యలు ఎగుమతి అయితే అందులో 2.4 బిలియన్ డాలర్ల విలువైన రొయ్యలు అమెరికాకు ఎగుమతి అయ్యాయి. దాదాపు 40 శాతం మార్కెట్ వాటా భారత్‌దే. మన దేశం నుండి విదేశాలకు ఎగుమతి అవుతున్న మాంస ఉత్పత్తిల్లో రొయ్యలు మూడవ స్థానంలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం నుండి నెల్లూరు జిల్లా వరకు ఆక్వా కల్చర్ అభివృద్ధి ఉంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుండి అత్యధికంగా ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఈ జిల్లాలో దాదాపు 1.20 లక్షల ఎకరాలు, రాష్ట్ర వ్యాప్తంగా 5.75 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతుంది. పశ్చిమ గోదావరి నుండే 3.5 లక్షల టన్నుల రొయ్యలు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. మొత్తం 18 వేల కోట్ల వ్యాపారం జరుగుతుంది. ఇందులో విదేశీ ఎగుమతుల వాటానే అధికం. కోవిడ్-19 కారణంగా ఎగుమతులు నిలిచిపోయి పరిశ్రమ నష్టాల్లో కూరుకుపోయింది. దీనికి తోడు వైరస్‌ల బెడద, ధరలు పతనం కావడం, రైతులకు సాగు పెట్టుబడి పెరిగి పోవడంతో ఆక్వా పరిశ్రమ ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. ఇటువంటి సమయంలో ట్రంప్ 27 శాతం సుంకాలు విధించడంతో పరిస్థితులు మరింత దిగజారిపోతున్నాయి.అమెరికా సుంకాలు విధించగానే 100 కౌంట్ రొయ్య ధర 240 నుండి 200 రూపాయలకు పడిపోయింది. కంపెనీలు కొనడానికి ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు అమెరికా ఏప్రిల్-6వ తేదీ నుండే సుంకాల పెంపు అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్న వాటి పరిస్థితి ఏంటి? ఆరవ తేదీ తరువాత అమెరికా రీచ్ అయ్యే ప్రతి సరుకుపై పెరిగిన సుంకాలు అమలు చేస్తామని అమెరికా అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ టారిఫ్ అమలైతే లక్ష రూపాయలు విలువ చేసే రొయ్యలు అమెరికాకు ఎగుమతి చేస్తే 26 వేల రూపాయల పన్ను కట్టాలి. అంతేకాకుండా రవాణా, ప్యాకింగ్, ఇతర ఖర్చులు కలిపి దాదాపు 50 శాతం పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే భారత్ ఎగుమతులపై యాంటీ డంపింగ్ డ్యూటీలు (ఎ.డి.డి)-3.88 శాతం, కౌంటర్ వైలింగ్ డ్యూటీలు (సి.వి.డి)-5.77 శాతం సుంకాలను వసూలు చేస్తున్నారు. కొత్తగా ప్రకటించిన టారిఫ్‌తో కలుపుకుంటే 35 శాతం వరకు ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 1 లక్ష టన్నుల రొయ్యలు ఎగుమతికి సిద్ధంగా ఉన్నాయి. ఇవి కోల్డ్ స్టోరేజ్‌లో ఉన్నాయి. అమెరికాకు 20-40 కౌంట్ ఉన్న రొయ్యలనే ఎగుమతి చేస్తారు. ఎగుమతిదారులు 30 కౌంట్ రొయ్యలను 480 రూపాయలకు కొని కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచారు. కొత్త టారిఫ్ ప్రకారం ఎగుమతి చేస్తే మరో 80 రూపాయలు అదనంగా ఖర్చు అవుతుంది. అంటే టన్నుకు రూ.8.50 లక్షలు నష్టం వస్తోంది. ఉన్న సరుకును ఎగుమతి చేయలేరు. కోల్డ్ స్టోరేజ్ ఖర్చులు భరించలేరు. మరోవైపు వడ్డీల భారం ఉండనే ఉంది.

ఈ సుంకాల విధింపు వల్ల ఎగుమతిదారులే కాకుండా.. రొయ్యల రైతులు, కార్మికులకు తీవ్ర నష్టం జరగనుంది. ఒడిదుడుకుల ప్రభావం మొట్టమొదట పడేది రైతులు, కార్మికుల పైనే. కౌలుకు తీసుకుని సాగు చేసే రైతుల పరిస్థితి మరింత దారుణం. సాగుతో పాటు దీనికి అనుబంధంగా ఉన్న ఫీడ్ కంపెనీలు, టెస్టింగ్ ల్యాబులు, మెడిసిన్ కంపెనీలు, ప్యాకింగ్ యూనిట్లు, ఇందులో పని చేసే కార్మికులపై వీటి ప్రభావం తీవ్రంగా పడుతుంది.రాష్ట్రంలో 450 పైగా రొయ్యల హేచరీలు, 50 పైగా ఫీడ్ మిల్లులు, 2 లక్షల పైగా రొయ్యల చెరువులు, 250 ప్రాసెసింగ్ ప్లాంట్లు, 6 వేలకు పైగా పడవలు, నౌకల ద్వారా కూడా వేలాది మందికి ఉపాధి కల్గుతుంది. 1.5 లక్షల మంది రైతులున్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షల మందికి ఆక్వా పరిశ్రమ ఉపాధి చూపుతుంది. పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిపోతే వీరంతా ఉపాధిని కోల్పోతారు. ట్రంప్ భారత పర్యటన సందర్భంలోనే భారత్‌పై సుంకాలు విధిస్తానని ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం కాలేదు. అమెరికాతో సత్సంబంధాలు ఉన్నా సంప్రదింపులు జరపలేదు. ట్రంప్ నా స్నేహితుడు, హౌడీ-మోడీ అని ప్రచారం చేసిన ప్రధాని ఇప్పుడు స్పందించటంలేదు. ఆక్రమ వలసదారుల పేరు చెప్పి భారతీయుల కాళ్లకు గొలుసులు కట్టి బానిసల్లా ఇండియాకు పంపినా నోరు మెదపలేదు. సుంకాలు విధించి ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్నా కిమ్మనడం లేదు మన ప్రధాని. దీంతో రూ.18 వేల కోట్ల టర్నోవర్ కలిగిన ఆక్వా పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిపోతుంది. లక్షల మంది రైతులు, కార్మికులు, ఎగుమతిదారులు నష్టపోతున్నారు. కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం సిక్స్, ఫోర్ అంటూ పథకాల ప్రచారంలో మునిగిపోయింది. ఈక్విడార్ నుండి ఎగుమతిలో గట్టి పోటీ ఎదురవుతుంది. ఇదే అలసత్వం ప్రభుత్వాలు ప్రదర్శిస్తే, ఇండియన్ మార్కెట్ అంతా ఈక్విడార్, ఇండోనేషియా వంటి దేశాలకు షిఫ్ట్ అయిపోతుంది. ఆక్వా రంగం నిలదొక్కుకోవాలంటే ఎగుమతులను ప్రోత్సహించే చర్యలు తీసుకోవాలి. దేశీయ మార్కెట్‌ను అభివృద్ధి చేసే విధంగా, అమెరికాపై ఆధార పడకుండా ప్రత్యామ్నాయ మార్కెట్లను ఏర్పాటు చేసుకోవడానికి దీర్ఘకాల వ్యూహాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉంది. తక్షణ ఉపశమనంగా రైతుల రుణాలను రీషెడ్యూల్ చేయాలి. ఎగుమతిదారులకు, కార్మికులకు ఆర్థికంగా అండగా నిలవాలి. ఏ.పి ఆర్థిక వ్యవస్థలో ఆక్వా రంగం కీలకమైంది. కనుక దీన్ని కాపాడాల్సిన అవసరం ప్రభుత్వానికి ఎంతైనా ఉంది.

# ప్రతిభాశాలి యజ్ఞేశ్వర చింతామణి





చిర్రావూరి యజ్ఞేశ్వర చింతామణి. ఈ పేరు చాలా మందికి తెలియనిది. నేటి జర్నలిస్టులు గాని, రాజకీయ నాయకులు గానీ చింతామణి గురించి ఎక్కువగా విని ఉండక పోవచ్చు. ఆయన ఒక తెలుగువాడిగా పుట్టడం తెలుగు వారందరికీ గర్వ కారణం. చదువులో రాణించలేక పోయినా, ఆంగ్ల భాషలలో విశ్వవిద్యాలయ పట్టాలేకున్నా, పుట్టిన గడ్డను వదిలి, నిండా 18 ఏళ్లు నిండకుండానే, ఒక ఆంగ్లపత్రికకు సంపాదకుడుగా కాగలిగి, దాదాపు మూడు దశాబ్దాల కాలం అదీ ఇంగ్లీషు వారి పరిపాలనా సమయంలో ముఖ్య సంపాదకత్వ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన అసమాన ప్రతిభాశాలి చింతామణి. చిర్రావూరు యజ్ఞేశ్వర చింతామణి 1880-1941) పోప్ ఆఫ్ ఇండియన్ జర్నలిజంగా పేరుపొందిన ప్రసిద్ధ పాత్రికేయులు, ఉదారవాద రాజకీయ నాయకులు. అలహాబాదు నుండి వెలువడిన లీడర్ అనే ఆంగ్ల పత్రికకు 1909 నుండి 1934 వరకు మూడు దశాబ్దాలపాటు సంపాదకత్వం వహించారు. ఈయన ఇండియన్ హెరాల్డ్, స్టాండర్డ్ పత్రికలను కూడా వ్యవస్థీకరించారు. 1880 ఏప్రిల్ 10న తెలుగు నూతన సంవత్సరాది నాడు చింతామణి జన్మించారు. విజయనగరం ఆస్థానంలో రాజపురోహితులు. ఆయన తండ్రి చిర్రావూరు రామసోమయాజులు, వేదపండితుడు, విజయనగరం సంస్థానంలో మహారాజా విజయరామ గజపతిరాజుకు రాజగురువు. తాతలు, తండ్రుల లానే చింతామణి కూడా పురోహితులు అవుతారని అందరూ అనుకున్నారు. యజ్ఞేశ్వర చింతామణికి 10 యేటనే వివాహమైనది. చింతామణి అనారోగ్యం వల్ల, మాతృవియోగం వల్ల ఎఫ్.ఏ పరీక్షలో ఉత్తీర్ణుడు కాలేక పోయారు. అయితే, యువరాజా సూచనతో, విజయనగరం మహారాజా కాలేజ్‌లో ఇంగ్లీషు చదువుకోసం వెళ్ళినా, చింతామణి విశాఖలో స్థానిక రాజకీయ వ్యక్తులతో తిరగటం ప్రారంభించారు.విశ్వవిద్యాలయాల నుండి పట్టాలు పొందలేక పోయాయినా, అసమానమైన ఆంగ్లభాషా పాండిత్యాన్ని సంపాదించారు. చదువుకొనే రోజుల్లోనే పత్రికలకు వ్యాసాలు రాశారు చింతామణి. స్వయంకృషితో పట్టుసాధించి, అనేక సభలలో ఉపన్యాసాలను ఇచ్చేవారు.పత్రికా రచనపై ఆయనకు ఆసక్తి మెండుగా ఉండేది. ప్రారంభ దశలో "తెలుగు హార్స్" అనే పత్రికకు సంపాదకుడిగా ఉన్నారు. ఈయన వ్రాసే వ్యాసాలు వైజాగ్ స్పెక్టేటర్ పత్రికలో అచ్చు అవటం ప్రారంభమైంది. ఆ తర్వాత కొంతకాలానికే 18 యేళ్ల వయసులోనే వైజాగ్ స్పేక్టేటర్ పత్రికకు సంపాదకత్వం వహించే అవకాశం లభించింది. అప్పట్లో 30 రూపాయలు జీతం ఇచ్చారు. ఆ తరువాత చింతామణి ఆ పత్రికను 300 రూపాయలకు కొని, తనతో పాటు వైజాగ్ స్పెక్టేటర్ పత్రికను విజయనగరానికి తీసుకొచ్చారు. తర్వాత ఆ వారపత్రికకు "ఇండియన్ హెరాల్డ్" అని నామకరణం చేశారు. ఆ తర్వాత ఈ విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ చింతామణీ "నేను కేవలం సంపాదకుడినేకాదు, ఫోర్మెన్, ప్రూఫ్ రీడర్, విలేఖరి, ఉపసంపాదకుడు, యజమాని అన్నీ నేనే' అని వివరించారు. పత్రిక బాగా ప్రాచుర్యం పొందినా ఆర్థిక ఇబ్బందుల వల్ల రెండు సంవత్సరాలలో దాన్ని మూసివేయవలసి వచ్చింది. ఆ సమయంలోనే చింతామణి భార్య మృతి చెందగా, మద్రాసుకు మకాం మార్చి, కొంతకాలం యునైటెడ్ ఇండియా అనే వారపత్రికలోను, ఆ తర్వాత జి. సుబ్రమణ్యం అయ్యర్ సంపాదకత్వంలో వెలువడుతున్న "మద్రాస్ స్టాండర్డ్" దినపత్రికలో ఒక సంవత్సరం పాటు పనిచేశారు. 1903లో నాగేంద్రనాథ్ గుప్తా ప్రారంభించిన "ఇండియన్ పీపుల్" పత్రికకు సంపాదకత్వం వహించడానికి అలహాబాదు మకాం మార్చారు. 1909 అక్టోబరులో మదన్ మోహన్ మాలవ్యా, తేజ్ బహద్దర్ సప్రూ వంటి మితవాద కాంగ్రెస్ నాయకులు "లీడర్" అనే ఆంగ్ల దినపత్రికను ప్రారంభించారు. "ఇండియన్ పీపుల్" పత్రిక "లీడర్" పత్రికలో కలిసిపోయింది. చింతామణి లీడర్ పత్రిక సంపాదకత్వ బాధ్యతను స్వీకరించారు. చింతామణి నిష్పక్షపాతమైన విమర్శకుడిగా పేరు గడించారు. ఈ పత్రికలోని సంపాదకీయాలు ఇతడికి మంచి పేరు ప్రతిష్ఠలను తెచ్చిపెట్టగా, 1916 వరకు లీడర్ పత్రికా సంపాదకుడిగా ఉన్నారు. 1927నుండి మళ్లీ లీడర్ పత్రికకు సంపాదకునిగా వ్యవహరించారు. పత్రికా రంగంతో పాటు రాజకీయాలపై కూడా ఆసక్తి ఉంది. 20 సంవత్సరాలు కూడా నిండని వయసులో 1900 సంవత్సరం చివరలో లాహెరులో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు హాజరయ్యేందుకు ప్రయాణ ఖర్చులకు డబ్బు లేకపోతే అప్పుచేసి వెళ్లారు. ఆ సమావేశాలలో అనేక విషయాలపై ఆయన చేసిన గంభీరమైన ఉపన్యాసాలు.సురేంద్రనాథ్ బెనర్జీ, భూపేంద్రనాథ్ బోస్ వంటి కాంగ్రెస్ నాయకుల ప్రశంసా పాత్రాలు అయినాయి. "హిందూ" పత్రిక ఆ ఉపన్యాసాలను ప్రశంసించింది. 1916లో తిరిగి 1927లోనూ ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనమండలి సభ్యులుగా ఎన్నికైనారు. 1921-23 మధ్య అప్పటి యునైటెడ్ ప్రావిన్సెస్ (నేటి ఉత్తరప్రదేశ్)కు విద్య, పరిశ్రమల శాఖల మంత్రిగా పనిచేశారు. 1930-31లో లండన్‌లో జరిగిన మొదటి రౌండ్ టేబుల్ సమావేశానికి ప్రతినిధిగా హాజరైనారు.కాంగ్రెస్ వాదిగా రాజకీయాలలో పాల్గొని, గాంధీ సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన ఉద్యమాలతో విభేదించి, మితవాదిగా పంథా మార్చుకున్నారు. అయినా గాంధీ, నెహ్రూతో సహా నాటి నేతలంతా చింతామణిని అభిమానించేవారు.బ్రిటీషు ప్రభుత్వం ఆయనకు 1939లో సర్ బిరుదునిచ్చి సత్కరించింది. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేటు (ఎల్.ఎల్.డి)ప్రదానం చేసింది. అలహాబాద్ విశ్వవిద్యాలయం డి.లిట్. గౌరవ పట్టాను ఇచ్చింది. తెలుగు తేజాన్ని, రాజకీయ పరిజ్ఞానాన్ని భారతదేశ మంతటా చాటిన చింతామణి 1941, జూలై 1 న తన 62వ యేట మరణించారు.మరణించిన దినాన సైతం ఆయన స్వీయ సంపాదకీయం రాయడం గమనార్హం.


రామ కిష్టయ్య సంగన భట్ల...

# దోషాలను తొలగించే ప్రదోష వ్రతం

ప్రదోషమంటే అది ఒక కాల విశేషము. దోషాలను హరించే ప్రశస్తమైన కాలాన్ని ప్రదోషకాలం అంటారు. ప్రదోషమంటే పాప నిర్మూలన అని అర్థము.ప్రతిరోజూ సూర్యాస్తమయ సమయములో చంద్రుడి కదలికల వలన ఏర్పడునది ప్రదోషము."ప్రదోషో రజనీ ముఖం" అంటారు. అంటే ప్రదోషకాలం రాత్రికి ప్రారంభం వంటిది. ఈ సమయం లో పరమశివుడు పార్వతీదేవితో కలిసి అర్ధనారీశ్వర రూపంగా దర్శనమిస్తాడు. చంద్రుడి గతి వలన, ఏర్పడే తిథుల సంధులలో సూర్యాస్తమయము అయితే, అప్పుడు ప్రదోషము అంటారు. త్రయోదశినాడు కలిగే ప్రదోషాన్ని 'మహా ప్రదోషం' అంటారు.ప్రదోష సమయం రోజు వస్తున్న త్రయోదశి నాడు వచ్చే ప్రదోష సమయం చాలా పవిత్రమైనది. త్రయోదశి వ్రతం శివుడు ప్రధాన దేవునిగా ఆచరించే వ్రతం. త్రయోదశి నాడు చేస్తారు కనుక త్రయోదశి వ్రతం అని, శివపూజ, రాత్రి భోజనం చేయడం వల్ల ప్రదోష వ్రతం అని అంటారు. త్రయోదశి వ్రతం ఆచరించడం వల్ల మహాశివుడు ప్రసన్నం అవుతాడు. సకల సుఖాలు, సర్వ సంపదల కోసం ఈ వ్రతం చేస్తారు. ప్రదోషం అంటే దోషాలను తొలగించేది అని అర్థం. ప్రతి రోజూ సూర్యాస్తమయ కాలంలో దాదాపు ఆరు ఘడియల అంటే రెండు గంటల 24 నిమిషాల సమయాన్ని ప్రదోష కాలంగా పరిగణిస్తారు. ప్రదోష కాలములో త్రయోదశి తిథి ఉంటే దానిని మహా ప్రదోషం అంటారు. మహా ప్రదోషం రోజున శివ భక్తులు ప్రదోష వ్రతాన్ని ఆచరిస్తారుస్కంద పురాణంలో ప్రదోష మహత్య కథ కూడా వివరింప బడింది. రెండు త్రయోదశి తిథులలో (శుక్ల పక్షము/ కృష్ణ పక్షము) ప్రదోష వ్రతాన్ని ఆచరిస్తారు. కొన్ని ప్రాంతాలలో మాత్రం కేవలం కృష్ణ పక్ష ప్రదోషం రోజును మాత్రమే పాటిస్తారు.అన్ని పూజలు, వ్రతాల వలె త్రయోదశి వ్రతాన్ని ఉదయం వేళ కాకుండా, సూర్యాస్తమయం నుండి రాత్రి రెండు ఘడియలలోపు ఈ పూజ చేస్తారు. ఏ నెలలో అయినా త్రయోదశినాడు ఈ వ్రతం చేసుకోవచ్చు. అయితే ఇది సుదీర్ఘకాలంపాటు చేయాల్సిన వ్రతం. ప్రతినెలలో వచ్చే రెండు త్రయోదశుల్లోనూ త్రయోదశి వ్రతం చేయాలి. అలా 11 సంవత్సరాల పాటు ఆచరించాలి. ఏదయినా ఆటంకం వచ్చి మధ్యలో చేయలేకపోతే ఉద్యాపన చేసి ప్రతిమను విసర్జించవచ్చు. ప్రదోషకాలంలో పరమేశ్వరుడు ఏకకాలంలో రెండు రూపాల్ని ప్రదర్శిస్తూ ఎడమభాగాన పార్వతి రెండవ భాగమున పరమేశ్వర రూపంగా



"అర్థనారీశ్వరుడుగా" దర్శనమిచ్చేకాలం. ప్రదోష సమయంలో శివుడు అర్థనారీశ్వర రూపంలో ఆనంద తాండవ నృత్యం చేస్తాడని నృత్యరత్నావళి లో చెప్పబడింది. ప్రదోష సమయంలో సమస్త దేవతలందరూ శివుడిని అర్చిస్తారని భావిస్తారు. ప్రదోష సమయంలో చేసే శివారాధన ఉత్తమమని చెప్పబడుతుంది. ఈ సమయంలో శివారాధన చేయటాన్ని సమస్త దేవతలను పూజించటంతో సమానంగా భావిస్తారు. మహాశివుడు అభిషేక ప్రియుడు కనుక మంత్రోక్తంగా పంచామృతాలతో ఆయనను అభిషేకించాలి. వీలు పడని వారు ఆలయానికి వెళ్ళి ప్రదోష సమయం లో అభిషేకం చేయించవచ్చు.ప్రదోషకాలం లో శివప్రదోష స్తోత్రాన్ని పఠించడం వలన విశేష ఫలితాలు పొందవచ్చు. ప్రదోష సమయంలో శివాలయాలలో జరిగే అభిషేకాలను దర్శించే వారికి సకల సంపదలు సిద్ధిస్తాయని భావిస్తారు. ఈ సమయంలో శివుడితో పాటు నందీశ్వరుడిని కూడా ఆరాధిస్తారు. నందీశ్వరుడు నాలుగు వేదాలు, 64 కళలను అభ్యసించిన నిష్ణాతుడైనప్పటికీ, వినయంతో వుండి, శివునికి ఏర్పడిన అనుమానాలను కూడా నివృత్తి చేస్తాడని విశ్వసిస్తారు. అందువల్ల నందీశ్వరుడిని ఆరాధించడం వలన బుద్ధికుశలత, మానసిక ఉల్లాసం లభిస్తాయి. త్రయోదశి తిథి ఆదివారం రోజు వస్తే దానిని రవి ప్రదోషం అని, సోమవారం రోజు వస్తే దానిని సోమ ప్రదోషమనీ, మంగళవారం రోజు వస్తే దానిని భౌమ ప్రదోషమని, బుధవారం రోజు వస్తే దానిని బుధ ప్రదోషమని, గురువారం రోజు వస్తే దానిని గురు ప్రదోషమని, శుక్రవారం రోజు వస్తే దానిని శుక్ర ప్రదోషమని, శనివారం రోజు వస్తే దానిని శని త్రయోదశి అనీ, శని ప్రదోషమని పిలుస్తారు.దేవ దానవులు క్షీర సాగరాన్ని మథించినప్పుడు వెలువడిన హాలాహలం నుండి శివుడు ప్రపంచాన్ని రక్షించిన రోజుగా శనిప్రదోషం రోజును చెబుతారు. శని కర్మకారకుడు, శివుడు సంహార కారకుడు కావున శని ప్రదోష సమయాన శివారాధన చేయడం ఉత్తమంగా పరిగణిస్తారు. సోమవారం శివుడికి ప్రీతికరమైనది. కాబట్టి ఆ రోజున వచ్చే సోమ ప్రదోషమును ప్రశస్తమైనదిగా భావిస్తారు. ఈ రోజున ప్రదోష వ్రతము ఆచరించటం వలన మనసులోని మలినాలన్నీ తొలగిపోతాయి.

త్రయోదశీ ప్రదోషము గురువారం వస్తే ఆ రోజును గురు త్రయోదశిగా భావిస్తారు. గురు ప్రదోష పూజ వలన విద్యాబుద్ధులు, సంపదలు కలుగుతాయని చెబుతారు. జాతకములో ఉండే గురు దోషములకు రుద్రారాధన విరుగుడుగా భావిస్తారు.ప్రదోషం రోజు ఉదయమే స్నానం చేసి తెల్లని వస్త్రాలను ధరించి, శరీరంపై విభూతిని, రుద్రాక్షమాలను కూడా ధరించటం మంచిది. ఆ రోజులో వీలైనప్పుడల్లా పంచాక్షరి మంత్రాన్ని (ఓ నమ:శివాయ) జపం చేయాలి. ప్రదోషం రోజున నిశ్శబ్దంగా ఆరాధించటాన్ని శివుడు ఇష్టపడతాడని చెబుతారు. కఠిన ఉపవాసం చేయలేనివారు పండ్లు, పాలు లాంటివి తీసుకోవచ్చు. ఉడికించిన పదార్థాలను తీసుకోకూడదు. సాయంకాలం ప్రదోష సమయంలో స్నానమాచరించి శివ షోడశోపచార పూజ జరపాలి. ప్రదోషం రోజు ఆ పరమ శివుడికి నేతి దీపారాధన, ఆవుపాలతో అభిషేకం అభిషేకం చేయటం, బిల్వ పత్రాలు మరియు శంఖుపూలతో అర్చించటం శ్రేయస్కరం. మహా మృత్యుంజయ మంత్రాన్ని ...ఓం త్రయంబకం యజామహే, సుగంధిం పుష్టి వర్ధనం, ఊర్వారుకమివ బంధనాత్, మృత్యోర్ముక్షీయ మామృతాత్... మహా మృత్యుంజయ మంత్రము పఠించాలి....108 సార్లు జపించి ప్రదోష కథను వినటంగానీ చదవటం గానీ చేయాలి. ఇంటిలో పూజ ముగించిన అనంతరం శివాలయాన్ని దర్శించాలి. వీలైనవారు ప్రదోష స్తోత్రం, శివ స్తోత్రములను కూడా పఠించాలి.

# తోబుట్టువులు - దేవుడిచ్చిన ఆత్మీయ రక్త సంబంధీకులు

డిజిటల్ యుగంలో మానవ సంబంధాలు పునర్నిర్వహించబడుతున్నాయి. న్యూక్లియర్ ఫ్యామిలీ కల్చర్ పెరుగుతున్నది. నాడు "ఇద్దరు లేదా ముగ్గురు బిడ్డలను కనండి" అన్న కుటుంబ నియంత్రణ నినాదం నేడు "ఒక్కరు లేదా అసలే వద్దు" అనే దుస్థితికి చేరడం చూస్తున్నాం. వివాహ బంధం, మంగళ సూత్రం భారమని తలిచి డేటింగ్, సహజీవన సంసారులు, సిచువేషన్‌షిప్ సంబంధాలు పెరిగాయి. సింగిల్ పేరెంట్ సంస్కృతి ఫ్యాషన్ అయిపోతున్నది. ఒక్క సంతానమే తల్లితండ్రులకు భారం అయిపోతున్నది. కుటుంబం అంటే అమ్మ నాన్నతో పాటు ఒక అబ్బాయి లేదా అమ్మాయి మాత్రమే అయిపోతున్నారు. ఈ ఏఐ యుగపు కుటుంబాల్లో ఇద్దరు లేదా అంత కన్న ఎక్కువ సంతానం ఉండడం అరుదైపోతున్నది. నేడు తోబుట్టువులు ఉన్న కుటుంబాలు తక్కువగానే కనిపిస్తున్నాయి. తోబుట్టువులు ఉన్న కుటుంబాలు పిల్లల ఆటపాటలతో ఉల్లాసంగా ఉండడం, తోబుట్టువుల మధ్య రక్త సంబంధం పెనవేసుకుపోవడం, ఒకరినొకరు ప్రాణాలకు మిన్నగా త్యాగగుణంతో జీవించడం చూస్తున్నాం. అదే విధంగా ఒక వయస్సు దాటిన పిదప తోబుట్టువుల మధ్య రక్త సంబంధాలు రక్తపాతం వరకు కూడా వెళ్లడం చూస్తున్నాం. అంతర్జాతీయ తోబుట్టువుల దినోత్సవ ప్రాధాన్యం: తోబుట్టువుల మధ్య పవిత్ర రక్త సంబంధం ఉండడం, ఒకరికొకరు ప్రేమగా చూసుకోవడం, సోదరికి సోదరుడు జీవిత కాల రక్షకుడిగా ఉండడం లాంటి విషయాలను అవగాహన పర్చడానికి ప్రతి ఏట 10 ఏప్రిల్‌లన "అంతర్జాతీయ లేదా ప్రపంచ లేదా జాతీయ తోబుట్టువుల దినం (నేషనల్ లేదా వరల్డ్ సిబ్లింగ్స్ డే)"ను పాటించుట ఆనవాయితీగా మారింది. ప్రతి ఒక్కరి జీవితంలో అమ్మ నాన్న తర్వాత అతి ప్రేమ కలిగిన ఆత్మీయ బంధువులుగా తోబుట్టువులు నిలుస్తున్నారు. హిందూ సమాజం సోదరసోదరీమణుల మధ్య రక్త సంబంధ విలువను తెలుపులకు "రక్షాబంధన్" లేదా "రాఖీ పండుగ"ను తోబుట్టువుల దినం మరో రూపంలో పవిత్రంగా నిర్వహించుకుంటున్నాం. చిన్నతనంలో సోదరి సున్నితమైన ప్రేమను రుచి చూడని సోదరుడు, నేనున్నాననే అనంత ధైర్య రక్షణ గొడుగు పట్టే సోదరుడి తెగువ చూడని సోదరి ఉండదు. అంతర్జాతీయ తోబుట్టువుల దినోత్సవ చరిత్ర: 1995లో తన సోదరుడు, సోదరిని చిన్న వయస్సులోనే కోల్పోయిన అమెరికన్ "క్లాడియా ఇవర్ట్" తన సోదరి లిసెట్టె పుట్టిన రోజున 10 ఏప్రిల్‌న "తోబుట్టువుల దినం ఫేండేషన్" ఏర్పరిచి తోబుట్టువుల దినం జరుపుకోవడం ప్రారంభించాడు. అనంతరం అమెరికాలో ఒబామా చొరవతో "జాతీయ తోబుట్టువుల దినం", తర్వాత 1998 నుంచి ఐరాస నేతృత్వంలో "అంతర్జాతీయ తోబుట్టువుల దినోత్సవం" పాటించుట కొనసాగుతున్నది. వయస్సు పెరగడంతో పాటు ప్రాధాన్యాలు, చదువుల మార్గాలు, వివాహాలు జరగడం, ఉద్యోగ ఉపాధుల పేరుతో విడివిడిగా వేరు వేరు ప్రాంతాల్లో జీవించడం కొనసాగుతూనే అనువంశిక ఆస్తి తగాదాలతో గొడవలు పడడం లాంటి అవాంఛనీయ విభేదాలు కూడా పొడచూపడం తరుచుగా గమనిస్తున్నాం. తోబుట్టువుల అపురూప రక్త సంబంధం: శరీరంలో కాళ్లు సోదరులను, చేతులు సోదరీమణులను పోలి ఉంటాయి. అమితమైన ప్రేమలు కలిగిన తోబుట్టువులు ఉన్న ఇల్లు బలమైన మానవ రక్త సంబంధాలు కొలువైన కోవెలగా నిలుస్తున్నది. మన మనస్తత్వం అణువణువున తెలిసిన వ్యక్తులుగా తోబుట్టువులు నిలుస్తారు. భార్యాభర్తల బంధాలను పోలిన బంధాలుగా తోబుట్టువుల సంబంధాలు నిలుస్తున్నాయి. మనం ఏ వయస్సులో ఉన్నా చిన్నతనపు రోజులను గుర్తు చేసే వారు తోబుట్టువులు మాత్రమే. సోదరి లేని సోదరుడి జీవితం ప్రేమలు కొరవడిన యాంత్రిక జీవితంగా నిలుస్తుంది. సోదరికి జీవితకాల హీరో సోదరుడు మాత్రమే. జీవితాంతం మన గురించి మంచిని ఆలోచించే వ్యక్తులుగా తోబుట్టువులు మాత్రమే నిలుస్తారు. సోదరుడికి చిన్న నొప్పి తగిలినా సోదరి కళ్లు కుళాయి వలె కన్నీళ్ల వరదలు పారిస్తుంది. తోబుట్టువులు అత్యుత్తమ స్నేహితులుగా లేదా శత్రువులుగా ఉండడం చూస్తున్నాం. అంతర్జాతీయ తోబుట్టువుల దినం వేడుకలు: అంతర్జాతీయ తోబుట్టువుల దినోత్సవం సందర్భంగా ప్రపంచ దేశాల్లో ప్రతి కుటుంబంలో సోదరసోదరీమణులు కలిసి సంతోషంగా గడపడం, వారి మధ్య పవిత్ర బంధాన్ని వ్యక్తం చేసుకోవడం, స్వల్ప విబేధాలను పరిష్కరించుకోవడం, రక్త సంబంధాల విలువను అవగాహన పర్చడం, తోబుట్టువులు అందరు కలిసి తమ వయస్సును మరిచి బాల్యాన్ని గుర్తు చేసుకుంటూ ఆటపాటలతో సరదాగా గడపడం, కుటుంబ సభ్యులు పిక్నిక్ రూపంలో బయటకు వెళ్లి గడపడం, ఆటపట్టించిన సందర్భాలను నెమరు వేసుకోవడం, తమ పవిత్ర బంధాన్ని జీవితాంతం కొనసాగించడానికి ప్రతిన బూనడం, తోబుట్టువులు కలిసి తల్లితండ్రులకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ సన్మానించుకోవడం, తోబుట్టువులు తమ విభేదాలను మరిచి తిరిగి ఏకం అయ్యే రోజుగా మార్చుకోవడం లాంటి పవిత్ర కార్యక్రమాలు నిర్వహించవచ్చు. జన్యువులను పంచుకొని పుట్టిన తోబుట్టువులు జీవితకాల ప్రేమలను పంచుకోవడానికి ప్రయత్నాలు చేయాలి. పొడ చూపిన స్వల్ప విభేదాలను పరిష్కరించుకుంటూ రక్త సంబంధ బలాన్ని ప్రదర్శించాలి. తోబుట్టువుల దినం ఆనందాల విందులు పంచి పెట్టే వేడుకలుగా మారాలి.


డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

# మెట్ పల్లి ప్రైవేట్ ఎలక్ట్రీషన్ వర్కర్స్ యూనియన్ ఎన్నిక

**- అధ్యక్షులుగా మీర్జా అజిజుల్లా బేగ్,**



**మెట్ పల్లి (మన వెలుగు) ఏప్రిల్ 10 :** గురువారం మెట్ పల్లి పట్టణంలోని మహాలక్ష్మి దేవాలయం వద్ద ఉన్న ఫంక్షన్ హాల్ లో ఎలక్ట్రిషన్ యూనియన్ సమావేశం జరిగింది. ఎలక్షన్ అధికారి తరి రాజశేఖర్ అధ్యక్షతన ప్రైవేట్ ఎలక్ట్రిషన్ వర్కర్స్ యూనియన్ ఎన్నికలు జరిగాయి ఫలితాల్లో భాగంగా అధ్యక్షులుగా మీర్జా అజిజుల్లా బేగ్ (తోఫిక్), ఉపాధ్యక్షులుగా సంగర్తి రవి, కార్యదర్శిగా ఎండి వాజిద్, సహాయ కార్యదర్శిగా నేరెళ్ల నరేష్, క్యాషియర్ గా సయ్యద్ అబిద్, సలహాదారులుగా కాదాసు శ్రీనివాస్, ఎండి కాసిం, మరియు కార్యవర్గ సభ్యులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ.. యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని, అభివృద్ధి దిశగా తన వంతు కృషి చేస్తానని అన్నారు.

# అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

**- 25 లక్షల విలువగల 286.570 గ్రాములు (28.6 తులాలు) బంగారు ఆభరణాలు స్వాదీనం**
**- వేసవి దృష్ట్యా జరిగే దొంగతనాలపై జిల్లా పోలీసుల ప్రత్యేక దృష్టి**
**- పోలీసు శాఖ వారి సూచనలు పాటించి దొంగతనాలు నియంత్రణ కు జిల్లా ప్రజలు సహకరించాలి**
**- అనుమానిత వ్యక్తుల కదలికలను గమనించి, పోలీసులకు సమాచారం ఇవ్వాలి**
**- జిల్లా ఎస్పి అశోక్ కుమార్**





**జగిత్యాల (మన వెలుగు) ఏప్రిల్ 10 :** ఇతను మొదటగా హైదరాబాద్ లోని కోటి లో గల కింగ్ లారీ ట్రాన్స్పోర్ట్ లో పనిచేసి అతని యజమాని జీతం ఇవ్వడం లేదని మొట్టమొదటగా లారీలోని పాటలు పాడె డెక్కును దొంగతనం చేసి పోలీసు వారికి దొరికి జైలుకు వెళ్లి వచ్చినాడు. మరల హైదరాబాద్ లో పలు దొంగతనాలు చేసి పోలీసువారికి దొరికి చంచల్ గుడా జైలుకు వెళ్లి వచ్చినాడు బయటకు వచ్చిన తర్వాత దొంగతనాన్ని తన వృత్తిగా ఎంచుకొని వివిధ ప్రాంతాల్లో పలు దొంగతనాలు చేసి జైలుకు వెళ్లి వచ్చినాడు. 2018-2021 వరకు వరంగల్ సెంటర్ జైల్లో ఉండి వచ్చినాడు ఇట్టి నేరస్థుడు ఇప్పటి వరకు 25 దొంగతనాల కు చేయడ%శీ% జరిగింది. జగిత్యాల పట్టణం లో ని పలు ప్రాంతాల్లో దొంగతనాలు చేసి తేదీ 09-04-2025 న జగిత్యాల పట్టణ పోలీస్ వారు కొత్త బస్టాండ్ లో చౌరస్తా ఏరియాలో వాహన తనిఖీ చేస్తుండగా సమయం 06:00 గంటలకు అనుమానస్పద స్థితిలో తిరుగుతున్న నెరస్తున్ని పట్టుకుని విచారించగా అతని వద్ద బంగారు నగలు పట్టుబడగా పంచుల సమక్షం లో పూర్తి విచారణ చేసి అనంతరం అతడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించనైనది. నేరస్థుడు ప్రత్యేకించి దొంగతనాలు చేయడానికి అతని వద్ద ఎలాంటి వస్తువులను తీసుకునిపో డు అతిగా మద్యం తాగి దొంగతనానికి వెళ్ళిన ప్రాంతంలో దొరికిన వస్తువులతోనే తలుపుల యొక్క తాళాలు గొల్లంలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడుతుంటాడు. జిల్లా లో నేరస్థుడు 28-03-2025 న అరవిందనగర్, జగిత్యాల వద్ద 16-03-2024 న హనుమాన్ వాడ జగిత్యాల వద్ద 18-01-2025 న పురాణిపేట జగిత్యాల వద్ద 16-02-2025 న గణేష్ నగర్ జగిత్యాల వద్ద 23-02-2025 న పద్మనగర్, జగిత్యాల వద్ద 07-03-2025 న గోవిందుపల్లి, జగిత్యాల వద్ద తేదీ:18-03-2025 న కృష్ణనగర్, జగిత్యాల లో ఇలా పలు దొంగతనలకు పాల్పడి బంగారు ఆభరణాలు మరియు నగదు ఎత్తుకెళ్లినాడు. పైన తెలిపిన అన్ని కేసులలో రికవరీ అయిన మొత్తం బంగారం - 286.570 గ్రాములు(28.6 తులాలు) విలువ అందాద 25,00,000/- ఇట్టి దొంగను పట్టుకొని అతని వద్ద నుండి దొంగ సొత్తును రికవరీ చేయడానికి ప్రతిభ కనబరిచిన జగిత్యాల పట్టణ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, ఎస్ఐ లు కిరణ్, గీత, సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ లు విశాల్, జీవన్, మల్లేష్ ,గంగాధర్, సంతోష్, రాజిరెడ్డి, గార్లను జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ రివార్డు అందజేసి అభినందించారు. వేసవి లో జరిగే దొంగతనాలు దృష్ట్యా పోలీస్ శాఖ వారి పలు సూచనలు.....! ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం. లేదా ఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్లేవారు విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లాలి. వేసవి దృష్ట్యా ఇంటి బయట నిద్రించే సమయంలో విలువైన బంగారు ఆభరణాలు లేకుండా చూసుకోవాలి అదేవిధంగా ఆదమరచి నిద్రపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలి. విలువైన వస్తువులను స్కూటర్ డిక్కీల్లో, కారులలో పెట్టడం చేయరాదు. బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదు, తమతోపాటే తీసుకెళ్లాలి. గ్రామాలకు వెళ్లే వారు ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచాలి. విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు. ఆరుబయట వాహనాలకు హ్యాండిల్ లాక్ తో పాటు వీల్ లాక్ వేయాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిది. అనుమానిత వ్యక్తుల కదలికలను గమనించి, పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేటప్పుడు చుట్టు పక్కల వారికి లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి. అనుమానాస్పదంగా తమ వీధుల్లో తిరిగే కొత్త వ్యక్తుల కదలికలపై 100 డయల్ లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలి.

# వక్ఫ్ బిల్లును రద్దు చేయాలి

**- ఈనెల 13న హైదరాబాదులో ధర్నా విజయవంతం చేయాలి**
**- మర్కజీ ఇంతేజామీ మిల్లాతే ఇస్లామియా కమిటీ మాజీ అధ్యక్షుడు మహ్మద్ ఖుతుబొద్దిన్ పాషా**



**మెట్ పల్లి (మన వెలుగు) ఏప్రిల్ 10 :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని మెట్ పల్లి మర్కజీ ఇంతేజామీ మిల్లాతే ఇస్లామియా కమిటీ మాజీ అధ్యక్షుడు మహ్మద్ ఖుతుబొద్దిన్ పాషా డిమాండ్ చేశారు. గురువారం ఆయన మెట్ పల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13న కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని ట్యాంక్ బండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం దగ్గర మధ్యాహ్నం రెండు గంటలకు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అధిక సంఖ్యలో ముస్లిం మైనార్టీ సోదరులు, అనుబంధ సంఘ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవుడికి అంకితం చేస్తూ ముస్లిం దాతలు ఇచ్చిన భూములు వక్ఫ్‌బోర్డు పరిధిలో అనాదిగా ఉన్నాయన్నారు. ఈ ఆస్తులపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లింలపై ద్వేషంతో బడాబాబులకు అంటగట్టడానికి చట్టంలో మార్పులు తీసుకొని వచ్చిందన్నారు. పేదలకు చెందాల్సిన భూములను లాక్కోవడం ద్వారా ముస్లింలను ఆర్థికంగా బలహీనులను చేసి రాజకీయంగా, సామాజికంగా ఎదగకుండా చేయాలన్నది బీజేపీ లక్ష్యమని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ముస్లిం మైనార్టీల ఆస్తులకు రక్షణగా ప్రత్యేక వక్ఫ్ చట్టాన్ని రాజ్యాంగం అమలు చేసిందని, మోదీ ప్రభుత్వం ముస్లింలను అణగదొకేందుకు ఈ చట్టాలను సవరణలు చేయాలని చూస్తున్నదని, దీనిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాగా అధిక సంఖ్యలో ధర్నా కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మైనారిటీ నాయకులు సల్మాన్ ఖాన్ షేక్ షాహిద్ హుస్సేన్ సయ్యద్ సిరాజుద్దీన్ మహమ్మద్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు

# పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసుల దాడులు



**జగిత్యాల రూరల్ (మన వెలుగు) ఏప్రిల్ 10 :** జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సింగాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సీసీఎస్ పోలీసు లు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 5 గురుని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.10180 రూపాయలు, 5 మొబైల్ ఫోన్స్ ను సీజ్ చేసినట్లు తెలిపారు. పేకాట ఆడుతూ పట్టుబడ్డ వారిని జగిత్యాల రూరల్ పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేయడం జరిగింది. జిల్లా ఎస్పీ ఆదేశాలతో అక్రమ, అసాంఘిక కార్యక్రమాలపై నిఘా పటిష్టం చేసి, పక్క సమాచారంతో దాడులు నిర్వహిస్తున్నట్లు సిసిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

# తాత్కాలిక అధ్యాపకులను గుర్తించాలి

**- మేనిఫెస్టో ప్రకారం మాట నిలబెట్టుకోవాలి**
**- జీవో 21 రద్దు చేయాలి**




**కామారెడ్డి (మన వెలుగు) ఏప్రిల్ 10 :** తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణంలో పనిచేస్తున్న తాత్కాలిక అధ్యాపకులు గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల విశ్వవిద్యాలయాలలో సహాయ ఆచార్యుల నియామకానికై విడుదల చేసిన జీవో 21 ని వెంటనే రద్దు చేయాలని అన్నారు. ఆ జీవోలో తాత్కాలిక అధ్యాపకులకు సంబంధించిన సర్వీసులు పరిగణలోకి తీసుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము గత కొన్ని సంవత్సరాలుగా అన్ని అర్హతలు కలిగి ఉండి వివిధ విభాగాలలో తాత్కాలిక అధ్యాపకులుగా పనిచేస్తున్నామని, ఇప్పటికీ తమకు ఉద్యోగ భద్రత లేకపోయినా అర్ధాకలి, అరకొర జీతాలతో తాము పనిచేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో తాత్కాలిక ఆధ్యాపకులకు 12 నెలల 50 వేల రూపాయలతో కూడిన వేతనం అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక తమ ఊసే మర్చిపోయారని వాపోయారు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని వారు సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. గతంలో ఈ సమస్యపై ప్రభుత్వానికి సంబంధించిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు తమ గోడు వెళ్ళబోసుకుంటూ అనేకమార్లు వినతి పత్రాలను అందజేశామని తెలిపారు. వారు ప్రతిస్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి మీ సమస్య తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

12 విశ్వవిద్యాలయంలో గత రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న సుమారు 1000 మంది తాత్కాలిక అధ్యాపకుల కుటుంబాలను రోడ్డున పడకుండా వెంటనే ప్రభుత్వం చర్య తీసుకుని తమను ఆదుకొని ఉద్యోగ భద్రత కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన పార్ట్ టైం అధ్యాపకులు పాల్గొన్నారు.

# పోషణ పక్షం విజయవంతం చేయాలి

**- ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి**
**- పోషణ పక్షం గోడ పత్రికల ఆవిష్కరణ**
**- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



**ములుగు ప్రతినిధి (మన వెలుగు ) ఏప్రిల్ 10 :** పోషకాహార ప్రాముఖ్యతపై ఈనెల 22 వరకు నిర్వహించనున్న పోషణ పక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తన ఛాంబర్లో జిల్లా పోషణ పక్షం గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోషణ పక్షం-2025 కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఈ నెల 8 నుండి 22 వరకు మహిలాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆద్వర్యంలో వివిధ శాఖల సమన్వయ%శీ% తోఅంగన్వాడి కేంద్రం, ప్రాజెక్ట్ మరియు జిల్లా స్థాయిలో (4) రకాల ప్రతి పాదిత నేపద్యాలు(మొదటి 1000 రోజులపై దృష్టి, లబ్దిదారుల మాడ్యుల్ ను ప్రజాదరణ పెంపొందించడం, పిల్లల్లో ఉభకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి) పైన వివిధ రకాలైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లా వ్యాప్తం గా ఉన్నహా 4 ఐ సి డిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న 640 అంగన్వాడి కేంద్రంలలో ఆరు సంవత్సరంల లోపు చిన్నారులలో, గర్భిణులు, బాలింతలలో పోశాకాహారలోపంతో భాధ పడుతున్న వారిని గుర్తించి అంగన్వాడి కేంద్రాల ద్వార అందిస్తున్న పోషకాహారం ఇతర సేవలను పూర్తిగా వినియోగించుకోనేల అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్ జి, జిల్లా సంక్షేమ అధికారిణి శిరీష, డి ఎం అండ్ హెచ్ ఓ గోపాల్ రావు, డి పి ఆర్ ఓ రఫీక్, తహసీల్దార్ విజయ భాస్కర్, సూపర్ వైజర్, పోషణ్ అభియాన్ కో ఆర్డి నేటర్స్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇంగ్లీష్ పట్ల భయాన్ని పోగొట్టి ఆత్మస్థైర్యాన్ని పెంచాలి

**- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



**ములుగు ప్రతినిధి (మన వెలుగు ) ఏప్రిల్ 10 :** ఇంగ్లీష్ పట్ల భయాన్ని పోగొట్టి ఆత్మస్థైర్యాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని 54 ప్రాథమిక పాఠశాలల్లో రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు దిశ ఫౌండేషన్, ఈ ఎల్ ఎఫ్ ఇంగ్లీష్ సహకారంతో చేపట్టిన 80 రోజుల లెర్న్ టు రీడ్ (ఇంగ్లీష్ బోధన కార్యక్రమం) ముగిసిందనున జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ వేడుకకు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ముఖ్య అతిథిగా పాల్గొని పిల్లల్లో ఇంగ్లీష్ పట్ల భయాన్ని పోగొట్టి ఇంగ్లీష్ మాట్లాడుటలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలని కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సూచించారు. వివిధ మండలాల నుండి వచ్చిన 1 నుండి 5 వ తరగతి చదివే విద్యార్థులు ఇంగ్లీష్ లో వారి సెల్ఫ్ ఇంట్రడక్షన్, రోల్ ప్లే, సంభాషణ మొదలగు అంశాలను ప్రదర్శించగా కలెక్టర్ సంభ్రమాశ్చర్యానికి గురై పిల్లలను, ఉపాధ్యాయులను మరియు దిశా ఫౌండేషన్ వారి కృషిని కొనియాడారు. తదనంతరం ఉత్తమ ప్రతిబ కనపరిచిన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కలెక్టర్ మెమెంటో, సర్టిఫికెట్ లను అందచేశారు. మొదటి దశలో తీసుకున్న 54 పాఠశాలల్లో ఈ సి ఐ ఎల్ హైదరాబాద్ వారి ఆర్థిక సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం అయినందున మరో 54 పాఠశాలల్లో చేపట్టాలని మరియు లెవెల్ 1 లో ఉన్న పిల్లలను లెవెల్ 8 వరకు తీసుకెళ్లే వరకు ఈ కార్యక్రమం కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. దిశ ఫౌండేషన్, ఈ ఎల్ ఎఫ్ ఇంగ్లీష్ వారు మొదటగా గత నవంబర్ లో 54 ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న ఇంగ్లీషు బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి వీడియో లెసన్స్ తో కూడిన డిజిటల్ మెటీరియల్ మరియు వర్క్ బుక్ లను సమకూర్చడం జరిగింది. ఈ మెటీరియల్ ను ఉపయోగించి ఉపాధ్యాయులు గత డిసెంబర్ నుండి పిల్లలకు బోధన చేయడం మరియు యాక్టివిటీలు చేయించడం ద్వారా పిల్లలు చాలా ఉత్సాహంగా పాల్గొని ఇంగ్లీష్ పట్ల భయం పోయి అనర్గళంగా ఇంగ్లీష్ మాట్లాడుతున్నారు. గత నెలలో మంత్రి సీతక్క చల్వాయి పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థులు ఇంగ్లీష్ లో మాట్లాడడం చూసి మంత్ర ముగ్ధులయ్యారు. ఈ లెర్న్ టు రీడ్ ఇంగ్లీష్ బోధన కార్యక్రమం 80 రోజులు పూర్తి చేసుకొని విజయవంతం అయినందున ఈ రోజు కలెక్టర్ ఆడిటోరియం నందు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి జి పాణిని, సెక్టోరల్ అధికారి అర్షం రాజు, సాంబయ్య, దిశా ప్రతినిధులు ఐశ్వర్య, ప్రతిభ, వివిధ మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# మట్టి తరలింపునకు పకడ్బందీ మార్గదర్శకాలు రూపొందించాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి (మన వెలుగు) ఏప్రిల్ 10 :** జిల్లాలో ఇతర వాణిజ్య అవసరాలకు మట్టి తరలింపు కోసం పగడ్బందీ మార్గదర్శకాలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మట్టి తరలింపు విధివిధానాల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న నీటి వనరుల నుంచి మట్టి తరలింపుకు పకడ్బందీ విధానం తయారు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వాణిజ్య అవసరాలు గమనిస్తూనే పర్యావరణాన్ని సంరక్షించే విధంగా పాలసీ రూపకల్పన ఉండాలని, పోలీస్ అధికారులు, రెవెన్యూ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు, మైనింగ్ అధికారులు, సమన్వయంతో అందరికీ ఉపయోగపడే విధంగా పాలసీ తయారు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డీసీపీ కరుణాకర్, ఆర్డీవో గంగయ్య, ఉప సంచాలకులు మైనింగ్ శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ రమేష్, కలెక్టరేట్ సి విభాగం పర్యవేక్షకులు ప్రకాష్, తహసిల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గాజులరామారం సర్కిల్ 26 లో కబ్జాల హవ

**- మాకు మీరు ఏంటి చెప్పేది అని స్థానికులపై విరుచుకు పడుతున్న కబ్జా దారులు**
**- ఎటువంటి పర్మిషన్ లేకున్నా కాళీ స్థలం లో సీసీ రోడ్ నిర్మాణం**



**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) ఏప్రిల్ 10 :** కుత్బుల్లాపూర్ గాజులరామారాం, సర్కిల్-26 సర్వే నం. 148, స్టార్ లైట్ అపార్ట్మెంట్స్ సమీపంలో, చింతల్ డివిజన్లోని దోబీ ఘాట్ కు సంబందించిన ఖాళీ స్థలంను అక్రమంగా ఆక్రమించి అందులో ఇళ్లను కట్టి పేదవారికి అమ్ముతు చట్టవిరుద్ధమైన చేర్యలకు పాలుపడుతున్న కబ్జా కళాకారుల నుండి భూమిని కాపాడండి అని స్థానికులు కొంత మంది న్యాయం చేసే వారి ద్రుష్టికి తీసుకురగా ఈ భూమి ప్రైవేట్ యాజమాన్యంలోని పట్టా భూమిగా ఉన్నప్పటికీ, బగత్ సింగ్ నగర్కు చెందిన కొంతమంది ప్రభావవంతమైన వ్యక్తులు ఇక్కడ ఉన్న భూమిని అక్రమంగా ఆక్రమించి, దానిని 29 ప్లాట్లుగా విభజించి అమ్మకానికి పెట్టి సొమ్ము చేసుకుంటున్నట్టు సమాచారం అందుకున్న స్థానికులు అక్రమ ఇట్టి కార్యకలాపాలకు పాలుపడుతున్న వారికీ స్థానిక రాజకీయ నాయకులు మద్దతు ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూమీ యజమానిని బెదిరించడం ద్వారా లేదా ఒత్తిడి చేయడం ద్వారా వారిని నోరు మెదపనివ్వడం కుండా ఉంచుతున్నారని, అంతేకాకుండా ఇట్టి భూమిని ప్రభుత్వ ఆస్తిగా చిత్రీకరిస్తూ భవిష్యత్తులో పట్టా మంజూరు చేస్తామని అమాయక కొనుగోలుదారులను మోసం చేస్తున్నారని తెలుస్తోంది. ఈ పద్ధతి ద్వారా ప్రైవేట్ భూమిని ఆక్రమించడమే కాకుండా, కొనుగోలుదారులను తప్పుదారి పట్టిస్తున్నారు. భూమిపై ఎటువంటి చట్టబద్ధమైన అనుమతులు లేకుండానే సిసి రోడ్డు నిర్మాణం జరిగిందని, అక్రమ ఆక్రమణదారుల సౌలభ్యం కోసం మున్సిపల్ అధికారులు ఈ రోడ్డును వేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అదనంగా, చెరువు బఫర్ జోన్/%ఖీూ%లో నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ, వాటికి ఇంటి నంబర్లు మరియు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయడం ఆందోళన కలిగిస్తోంది. ఈ విషయంలో తక్షణ దర్యాప్తు జరిపి, అక్రమ ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, అక్రమాలకు సహకరించిన మున్సిపల్ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ సమస్యపై కమిషనర్, కూకట్పల్లి జోనల్ కమిషనర్ దృష్టి సారించి, న్యాయమైన చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్, నల్ల జై శంకర్ గౌడ్, ఈశ్వర్ రెడ్డి, అరుణ్ రావు మరియు చందు తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు స్వామి వారిని దర్శించుకునేలా చూడాలి

**- చిన్న హనుమాన్ జయంతి కి 900 మంది సిబ్బందితో పటిష్ట భద్రత**
**- సీసీ కెమెరాలు ద్వారా నిరంతర పర్యవేక్షణ**
**- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



**జగిత్యాల (మన వెలుగు) ఏప్రిల్ 10 :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టులో చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు స్వామి వారిని దర్శించుకునేలా, ఎలాంటి అవచినీయ సంఘటనలు జరగకుండా 900 మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ తెలిపారు. బందోబస్తుని 6 సెక్టార్స్ గా విభజించి 3 షిఫ్టుల పద్ధతిన విధులు కేటాయించడం జరిగిందిని అన్నారు. ఈ సందర్భంగా హనుమాన్ జయంతి బందోబస్తుకు వచ్చిన పోలీసు అధికారులు సిబ్బందిని ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ ..... చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఏలాంటి నేరాలకు తావులేకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే జిల్లా పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు పోలీస్ సిబ్బంది ఓపికతో సలహాలు, సూచనలు ఇస్తూ భక్తుల మన్ననలు పొందేలా విధులు నిర్వర్తించా లని, ఎక్కడ కూడా అసౌకర్యం కలగకుండా అందరూ సమన్వయంతో విధులు నిర్వహిస్తూ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ముఖ్యంగా దేవస్థానం, మాల విరమణ వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండి భక్తులు క్యూ లైన్ పాటించేలా చూడాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా 24 గంటలు పోలీస్ నిఘా ఉంచాలని ప్రతి ఒక్క భక్తుడు ప్రశాంతమైన వాతావరణంలో ఆంజనేయ స్వామిని దర్శించుకుని క్షేమంగా తిరిగి వెళ్లేవిధంగా ప్రతి పోలీస్ బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు.

**పార్కింగ్ ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు:**

ఈ సంవత్సరం భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున భారీ సంఖ్యలో వచ్చే వాహనాలను క్రమ పద్ధతిలో పార్కింగ్ చేసేలా చూడాలని, ట్రాఫిక్ ,పార్కింగ్ ప్రదేశాల్లో విధుల్లో ఉన్న సిబ్బంది ట్రాఫిక్ జామ్ అవకుండా నియంత్రణ చేయాలన్నా రు. రాత్రి వేళలో ప్రమాదాలు జరగకుండా స్టాపర్స్, కోన్స్, స్టిక్కర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఆలయ పరిసరాల్లో ఏర్పాటుచేయవలసిన భద్రత ఏర్పాటలను పరిశీలించి అదికారులకు పలు సూచనలు చేశారు.

**హనుమాన్ జయంతి సందర్భంగా కాలి నడకన వచ్చే భక్తులు రోడ్డుపైన వెళ్ళే వాహనాలు గమనిస్తూ నడవాలి :**

హనుమాన్ దీక్ష తీసుకున్న దీక్షపరులు కాలినడకన కొండగట్టుకు వచ్చే సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రేడియం స్టికర్స్ ను వారి బ్యాగులకు, జెండా కు అంటించడం జరిగింది. రోడ్డు కు ఇరువైపులా నడుస్తున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని వాహనాలను గమనిస్తూ తమ యొక్క గమ్యస్థానానికి చేరుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి లు రఘు చందర్, రాములు, రంగరెడ్డి, ఎస్బి ఇన్స్పెక్టర్ అరిఫ్ అలీ ఖాన్, సి.ఐ లు రవి ,రామ్ నరసింహారెడ్డి, సురేష్ ,అనిల్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కిరణ్ కుమార్, వేణు, వివిధ జిల్లాలకు చెందిన సి.ఐలు, ఎస్.ఐ లు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు



# నౌకా దళానికి రఫేల్

న్యూఢిల్లీ: విమానవాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌పై మోహరించేందుకు సుమారు రూ.64 వేలకోట్ల వ్యయంతో ఫ్రాన్స్ నుం చి 26 నౌకాదళ వేరియంట్ల రఫేల్ ఫైటర్ జెట్‌ల కొనుగోలు ప్రతిపాదనకు ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో భద్రతపై కేబినెట్ కమిటీ(సిసిఎస్) ఆమోదముద్ర వేసినట్లు రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. భార త్, ఫ్రాన్స్ మధ్య అంతర్ ప్రభుత్వ యం త్రాంగం కింద కాంట్రాక్ట్‌పై సంతకాల అనంతరం సుమారు ఐదు సంవత్సరాల్లో జెట్ల సరఫరా మొదలవుతుంది. వరుస సంప్రదింపులు, ప్లాట్‌ఫారమ్ మదింపు పరీక్షల దరిమిలా 2023 జూలైలో రక్ష ణ మంత్రిత్వశాఖ భారీ స్థాయిలో రఫాలె జెట్ల కొనుగోలుకు ప్రాథమికంగా ఆమో దం తెలిపింది. ఆ ఒప్పందం కింద, భారతీయ నౌకాదళం రఫేల్(మెరైన్) జెట్ల ఉత్పత్తి సంస్థ దసాల్స్ ఏవియేషన్ నుంచి ఆయుధ వ్యవస్థలు, విడిభాగాలు సహా అనుబంధ పరికరాలను కూడా పొందుతుంది. భారతీయ వైమానిక దళం (ఐఎఫ్)గగనయానస్థితిలో 36 రఫాలె యు ద్ధ విమానాలను కొనుగోలు చేసింది. కనీ సం మరి రెండు రఫేల్ జెట్ల స్కాడ్రన్‌లు కొనుగోలు చేయాలని కూడా ఐఎఫ్ యోచిస్తోంది.

భారత్, ఫ్రాన్స్ మధ్య రక్ష ణ, వ్యూహాత్మక సంబంధాలు కొన్ని సం వత్సరాలుగా వృద్ధి చెందుతున్నాయి. భా రత నౌకాదళం బలాన్ని మరింతపెంచేందుకు మూడు స్కార్పీన్ జలాంతర్గాముల కొనుగోలుకు కూడా రక్షణ మం త్రిత్వశాఖసుమారు రెండేళ్ల క్రితం ఒకప్రతిపాదనను ఆమోదించింది. సిసిఎస్ ఆ ప్రాజెక్టుకు ఇంకా ఆమోద ముద్ర వేయలసి ఉంది. తిరుపతి,పాకాలకాట్పాడి మధ్య డబ్లింగ్ పనులకు కేంద్ర కేబినెట్ ఆమో దం తెలిపింది. దీని కోసం రూ.1332 కోట్లు ఖర్చు కాగలదని అంచనా.

# పది రోజుల్లో కూతురు పెళ్లి..

**అంతలోనే కాబోయే అల్లుడితో అత్త పరార్**

పదిరోజుల్లో కూతురు పెళ్లి. శుభలేఖలు వచ్చేశాయి. బంధువులకు పంచడమే తరువాయి.. ఈ తరుణంలో అత్త కాబోయే అల్లుడితో వెళ్లిపోయింది. పోతూ పోతూ, కూతురి పెళ్లికోసం దాచిన మూడున్నర లక్షల రూపాయల నగదు, ఐదులక్షల రూపాయల విలువ చేసే ఆభరణాలనూ మూట కట్టుకుని పోయిందట ఆ మహాతల్లి. ఉత్తరప్రదేశ్ లోని అలీగఢ్ లోని మద్రక్ పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామంలో ఈ ఘటన జరిగింది.తన తల్లి అనిత, తన కాబోయే భర్తతో చేసిన నిర్వాకాన్ని చెప్పి ఆ వధువు శివానీ కన్నీరు పెట్టుకుంది. ఏప్రిల్ 16న రాహుల్ తో తన పెళ్లి కావల్సి ఉందని, కానీ మొన్న ఆదివారం నాడు తన తల్లి రాహుల్ తో లేచిపోయిందని శివాని తెలిపింది. తన తల్లి రాహుల్ తో మూడు, నాలుగు నెలలుగా గంటల కొద్దీ ఫోన్ లో మాట్లాడేదని, ఇలా జరుగుతుందని అనుకోలేదని, ఇంట్లో 10 రూపాయలు కూడా లేకుండా నగదు,నగలు మొత్తం అనిత ఊడ్చుకు పోయిందని ఆ అమ్మాయి చెప్పింది.ఆమె తండ్రి జితేంద్ర కుమార్ బెంగళూరులో దుకాణం నడుపుతాడు. తన భార్య, కాబోయే అల్లుడితో కలిసి వెళ్లిపోయిందని తెలిసిన తర్వాత, పోలీసులకు తన భార్య కన్పించడం లేదని ఫిర్యాదు చేశాడు.వాళ్లు ఎలా పోయినా, అమ్మాయి పెళ్లికి కోసం దాచిన నగలు, నగదు ను పోలీసులు రికవరీ చేస్తే చాలు అంటున్నాడు జితేంద్ర కుమార్. తన భార్య కాబోయే అల్లుడితో ఫోన్ లో గంటలకొద్దీ మాట్లాడుతోందని తెలిసినా, కొన్ని రోజుల్లో కూతురు పెళ్లి ఉండడంతో ఆమెను ఏమీ అనలేదని చెప్పుకొచ్చాడు ఆయన. అనితకు, రాహుల్ కూ ఫోన్ చేసినా వారి ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చిందని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# దక్షిణ కొరియా అధ్యక్ష పదవికి ప్రతిపక్ష నేత పోటీ



దక్షిణ కొరియా ప్రతిపక్ష నాయకుడు లీ జే-మ్యుంగ్ అధ్యక్ష పదవికి పోటీ చేయనున్నట్లు గురువారం ప్రకటించారు. డిసెంబర్ లో మార్షల్ లా ప్రకటించిన మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ అభిశంసనను ఎదుర్కొన్నారు. దీంతో అధ్యక్ష ఎన్నికలు జూన్ 3న జరగనున్నాయి. ఈ మేరకు అసమానతలను పరిష్కరించడం, ఆర్థిక వృద్ధిపై దృష్టి పెడతానని లీ హామీ ఇచ్చారు. 2022 అధ్యక్ష ఎన్నికల్లో యూన్‌పై పోటీ చేసిన 61 ఏళ్ల లీ దేశ చరిత్రలోనే అతి తక్కువ తేడాతో ఓడిపోయారు. కానీ గత సంవత్సరం ఆయన తన లిబరల్ డెమోక్రటిక్ పార్టీని పార్లమెంటరీ ఎన్నికల్లో భారీ విజయం వైపు నడిపించారు. లిబరల్ ఓటర్ల నుండి బలమైన మద్దతు పొందుతున్నారు. ఏప్రిల్ 9న లీ ప్రధాన ప్రతిపక్ష పార్టీ నాయకుడిగా పదవీ విరమణ చేశారు. తన ఎన్నికల ప్రచారంపై దృష్టి పెట్టడానికి సిద్ధమవుతున్నారు. ఏప్రిల్ 4న ప్రకటించిన గాలప్ పోల్ ప్రకారం 34% మంది లీ జే-మ్యుంగ్ తదుపరి అధ్యక్షుడిగా ఎన్నికయ్యే అవకాశం ఉందని తెలిపారు.



# ఇజ్రాయిల్ రాయబారిగా అర్కెన్సా మాజీ గవర్నర్

అర్కెన్సా మాజీ గవర్నర్ మైక్ హక్బీని ఇజ్రాయిల్ రాయబారిగా నియమించినట్లు అమెరికా సెనెట్ నిర్ధారించింది. అమెరికా అధ్యక్షులు ట్రంప్ బుధవారం హక్బీని ఇజ్రాయిల్‌కి అమెరికా రాయబారిగా నియమిస్తూ కమిషన్‌పై సంతకం చేశారు.అంతకు ముందుగా అమెరికా సెనెట్ 53-46 ఓట్ల తేడాతో ఆయనను ధ్రువీకరించింది. హక్బీ నియామకం అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. కొత్త పదవిలో ఆయన అద్భుతంగా రాణిస్తారని అన్నారు. ఈ సందర్భంగా హక్బీ అధ్యక్షులు ట్రంప్‌కి కృతజ్ఞతలు తెలిపారు. రాయబారిగా విధులు నిర్వహించేందుకు ఎదురుచూస్తున్నానని అన్నారు. ఈ పరిణామాన్ని స్వాగతిస్తూ ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ ఒక ప్ర కటన విడుదల చేశారు. ఇజ్రాయిల్ -అమెరికా కూటమికి ఇది గొప్ప రోజు అని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి మీతో కలిసి పనిచేసేందుకు తాను ఎదురుచూస్తున్నానని ఆ ప్రకటనలో అన్నారు.

# దీటుగా స్పందించిన చైనా

బీజింగ్ : అమెరికా టారిఫ్‌లపై చైనా దీటుగా స్పందిస్తోంది. అమెరికా నుండి వచ్చే దిగుమతులపై టారిఫ్‌లను 84శాతానికి పెంచింది. గత వారం అమెరికా దిగుమతులపై 34శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు ప్రకటించిన చైనా బుధవారం అదనపు ప్రతీకార చర్యల్లో భాగంగా ఆ టారిఫ్‌లను 84శాతానికి పెంచింది. బుధవారం అర్ధరాత్రి 12.01 గంటల (గురువారం) నుండి అమల్లోకి వస్తాయని కస్టమ్స్ టారిఫ్ కమిషన్ ప్రకటించింది. అమెరికాకు చైనా చేసే ఎగుమతులపై ట్రంప్ ప్రకటించిన 104శాతం టారిఫ్‌లు బుధవారం నుండి అమల్లోకి వచ్చాయి. వైట్‌హౌస్‌తో టారిఫ్‌ల విషయమై చర్చలు జరుపుతారా లేదా అని ప్రశ్నించగా చెప్పడానికి చైనా ప్రభుత్వం తిరస్కరించింది. అమెరికా మరింతగా తన ఆర్థిక, వాణిజ్య ఆంక్షలను పెంచడానికే సిద్ధపడినట్లైతే అవసరమైన ప్రతీకార చర్యలు తీసుకోవడానికి చైనా దృఢ నిశ్చయంతో వుందని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన శ్వేత పత్రం పేర్కొంది. ట్రంప్ ప్రభుత్వ మొదటి హయాంలో జరిగిన వాణిజ్య ఒప్పందంలో చేసిన హామీలను అమెరికా గౌరవించడం లేదని శ్వేతపత్రం పేర్కొంది. కాగా, టారిఫ్‌ల విషయంలో బేరసారాలు జరిపే అంశంపై చైనా ఇప్పటివరకు ఆసక్తిగా లేదని విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ బుధవారం వ్యాఖ్యానించారు. పొరుగు దేశాలతో ఉమ్మడి భవిష్యత్తుతో కూడిన సమాజాన్ని నిర్మించాలని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ బుధవారం పిలుపునిచ్చారు. పొరుగు దేశాలతో చైనా కార్యకలాపాలకు కొత్త వునాదిని వేయడానికి కృషి చేయాలన్నారు. పొరుగుదేశాలతో సంబంధాలపై మంగళ, బుధవారాల్లో బీజింగ్‌లో నిర్వ హిస్తున్న సదస్సులో జిన్‌పింగ్ పై వ్యాఖ్యలు చేశారు. నూతన శకంలో పొరుగు దేశాలతో సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు చైనా చేసిన కృషి, అనుభవాలు, సాధించిన విజయాలను జిన్‌పింగ్ తన ప్రసంగంలో వివరించారు. ప్రస్తుత పరిస్థితులను శాస్త్రీయంగా విశ్లేషించారు. తదుపరి దశలో పొరుగు దేశాలకు సంబంధించి చేపట్టాల్సిన కార్యకలాపాలు, లక్ష్యాలు, కర్తవ్యాలు, ఆలోచనలు, చర్యలను వివరించారు. విభేదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడంతో పాటు సరఫరా గొలుసును మెరుగుపరిచి వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేయాలని పొరుగుదేశాలకు సూచించారు.




# యూనివర్సిటీలపై ఆగని ట్రంప్ ప్రతీకార చర్యలు

అమెరికాలోని డోనాల్డ్ ట్రంప్ యంత్రాంగం అక్కడి యూనివర్సిటీలకు నిధులను నిలిపివేసే పరంపరను కొనసాగిస్తున్నది. ప్రతీకార చర్యలకు దిగుతోంది. డోనాల్డ్ ట్రంప్ యంత్రాంగం కార్నెల్ విశ్వవిద్యాలయానికి 1 బిలియన్ డాలర్లు, నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీకి 790 మిలియన్ డాలర్లకు పైగా నిధులను స్తంభింపజేసింది. పౌర హక్కుల ఉల్లంఘనలకు సంబంధించి ట్రంప్ యంత్రాంగం రెండు సంస్థలపై దర్యాప్తు చేస్తున్నది. ఈ నేపథ్యంలో నిధులను నిలిపివేసింది. పేరు వెల్లడించటానికి ఇష్టపడని యూఎస్ అధికారి ఒకరు ఈ విషయాన్ని తెలిపారు. "నిలిపివేయబడుతున్న నిధులలో ఎక్కువగా ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, రక్షణ సమాఖ్య విభాగాలకు సంబంధించిన గ్రాంట్లు, కాంట్రాక్ట్‌లు ఉంటాయి" అని సదరు అధికారి వివరించారు. పాలస్తీనా అనుకూల క్యాంపస్ నిరసనలు, వైవిధ్యం, సమానత్వం, ఇన్‌క్లూషన్ ప్రోగ్రామ్స్, ట్రాన్స్‌జెండర్ పాలసీలపై ఆందోళనల కారణంగా ట్రంప్ యంత్రాంగం విశ్వవిద్యాలయాల నుంచి ఫెడరల్ ఫండ్స్ నిలిపివేస్తామని బెదిరించింది. గతనెలలో, కార్నెల్, నార్త్‌వెస్టర్న్‌తో సహా 60 విశ్వవిద్యాలయాలకు ఒక లేఖను పంపింది. పాఠశాలలు తాను వర్ణించిన యాంటీసెమిటిజం (యూదువ్యతిరేకత) ను పరిష్కరించటంలో విఫలమైనట్టు సమీక్షలో తేలితే అమలు చర్యలు ఉంటాయని హెచ్చరించింది. మొత్తం నిధుల స్తంభన, విలువకు సంబంధించి అధికారిక నోటిఫికేషన్ అందనప్పటికీ.. రక్షణ, ఆరోగ్యం, సైబర్ భద్రతలో పరిశోధనలకు సంబంధించి రక్షణ శాఖ నుంచి పని నిలిపివేత ఉత్తర్వులు అందాయని కార్నెల్ విశ్వవిద్యాలయం పేర్కొన్నది. ప్రభుత్వం నుంచి మరిన్ని వివరాలు కోరుతున్నట్టు తెలిపింది. నిధుల స్తంభనపై మీడియా నివేదికలను నార్త్‌వెస్టర్న్ విశ్వవిద్యాలయం అంగీకరించింది. కానీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక నోటిఫికేషన్ రాలేదని వివరించింది. కొనసాగుతున్న దర్యాప్తునకు సహకరిస్తున్నట్టు విశ్వవిద్యాలయం వివరించింది.

# వెనక్కి తగ్గిన ట్రంప్

**90 రోజుల పాటు సుంకాల నిలిపివేత**

సుంకాల యుద్ధం అమెరికన్ మార్కెట్‌కు పెద్ద ఎదురుదెబ్బ తగిలిన తర్వాత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వైఖరిని మార్చుకున్నారు. చైనా కాకుండా ఇతర దేశాలపై విధించిన ప్రతీకార సుంకాలను 90 రోజుల పాటు నిలిపివేశారు. ఈ కాలంలో భారతదేశంతో సహా దేశాలకు సుంకాలు 10 శాతంగా ఉంటాయి. చైనా ఉత్పత్తులపై ప్రకటించిన 104 శాతం సుంకాన్ని 125 శాతానికి పెంచారు. 104 శాతం సుంకానికి ప్రతీకారంగా చైనా అమెరికా ఉత్పత్తులపై సుంకాలను 84 శాతానికి పెంచిన తర్వాత ట్రంప్ ఈ చర్య తీసుకున్నారు. అమెరికా ఉత్పత్తులపై సుంకాలు విధించాలని నిర్ణయించినట్లు యూరోపియన్ యూనియన్ ప్రకటించింది. ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్ అయిన చైనాపై సుంకాల



పెంపు అమెరికన్ ఎగుమతి కంపెనీల పునాదిని కదిలిస్తుందని ఒక అంచనా. మార్కెట్లో భారీ క్షీణత మధ్య ట్రంప్ వైఖరి మారింది. అమెరికా ఆర్థిక, వాణిజ్య ఆంక్షలను కొనసాగించాలని భావిస్తే గట్టిగా ప్రతీకారం తీర్చుకోవడానికి అనేక మార్గాలు ఉన్నాయని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ హెచ్చరించింది.

# టెర్రరిస్టు రాణాను రప్పిస్తున్న భారత్



న్యూఢిల్లీ: 2008 ముంబై టెర్రరిస్ట్ దాడుల కేసులో ప్రధాన నిందితుడు పాకిస్తాన్‌కు చెందిన తహవూర్ రాణాను అమెరికా భారత్ కు అప్పగించింది. ప్రత్యేక విమానంలో తహవూర్ రాణాను ప్ర స్తుతం అమెరికానుంచి తీసుకువస్తున్నారు. మరి కొద్ది గంటల్లో భా రత్‌కు చేరుకుంటాడు. తనను భారత్ కు అప్పగించవద్దని వేడుకుంటూ, అమెరికా కోర్టుల కాళ్లా వేళ్లా పడ్డా, రాణాకు అమెరికా లో ఉండే అవకాశాలు మూసుకు పోయాయి. దాంతో అమెరికా సుప్రీంకోర్టు ఆదేశం మేరకు రాణాను మనకు అప్పగిస్తున్నారు. తన అప్పగింతను నిలిపి వేయాలని, స్టే ఇవ్వాలని చివరి క్షణంలో కూడా రాణా సుప్రీంకోర్టు ప్రధాన ఆయన తెలియజేశారు. అవెురికాకు దిగుమతి అయ్యే అన్ని వస్తువులపై వసూలు చేస్తున్న కనీస టారిఫ్ సొమ్ము కూడా ఇందులో ఉందని ఆయన చెప్పారు. కాగా, టారిఫ్‌ల విషయంలో చర్చలకు తాను సిద్ధమని ట్రంప్ మరొకమారు ప్రకటించారు. ఈ విషయంలో జపాన్, దక్షిణ కొరియా దేశాలు ముందుకు వచ్చాయని ఆయన తెలిపారు. ట్రంప్ జపాన్‌పై 24 శాతం, దక్షిణ కొరియాపై 25 శాతం ప్రతీకారర సుంకాలు విధించారు. దీనిపై చర్చించేందుకు ఆయా దేశాల ప్రతినిధులు వాషింగ్టన్ వస్తున్నారని ట్రంప్ తెలియజేశారు. మరొక వైపు తాను విధించిన ప్రతీకార సుంకాలకు చైనా ప్రతిగా 34 శాతం పన్నులు విధించడంపై ట్రంప్ మండిపడ్డారు. ఆయన చైనాపై అదనంగా 50 శాతం పన్ను విధించారు. చైనాపై గతంలో 20 శాతం పన్ను వసూలు చేస్తుండగా, ట్రంప్ 34 శాతం ప్రతీకార సుంకాలు విధించారు. తాజాగా 50 శాతం అదనపు సుంకాలతో చైనాపై అమెరికా విధించిన పన్ను మొత్తం 104 శాతానికి చేరింది. ఈ పన్నులు బుధవారం నుంచి అమలులోకి వచ్చినట్లు ట్రంప్ తెలిపారు.

## గంజాయి అమ్ముతున్న నిందితున్ని పట్టుకున్న సిసిఎస్ పోలీసులు

**- 145 గ్రాముల గంజాయి స్వాధీనం**

జగిత్యాల రూరల్ (మన వెలుగు) ఏప్రిల్ 10 :జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టిఆర్ నగర్ లో గంజాయి అమ్ముతున్నారన్న సమాచారం మేరకు సీసీఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీ చేయగా ఎండి యాసిర్ అనే వ్యక్తి వద్ద 145 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని రూరల్ పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేయడం జరిగింది. ఈ తనిఖీలో హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ వినోద్ కుమార్ ,రమేష్ పాల్గొన్నారు

# సామాన్యుల సంపద ధనికుల జేబుల్లోకి:



దేశంలో గుత్తాధిపత్యం కారణంగా సామాన్యుల సంపద ధనికుల జేబుల్లోకి వెళ్తోందని, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. గుజరాత్ లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ మెమోరియల్ వద్ద నిర్వహించిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ ) సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. “ ఎన్నికల సంస్థలతో సహా అన్నింటిలోనూ కేంద్రం జోక్యం చేసుకుంటోంది. అన్నిచోట్లా తన ఆధిపత్యాన్ని నెలకొల్పుతోంది. ఎలక్ట్రానిక్ టెక్నాలజీ కారణంగా ఎన్నికల్లో మోసాలు జరుగుతున్నాయి.

ప్రపంచం లోని అభివృద్ధి చెందిన దేశాలు ఈవీఎంలను వదిలి బ్యాలెట్ వైపు మొగ్గు చూపుతున్నాయి. ప్రపంచంలో ఎక్కడా ఈవీఎంలు అందుబాటులో లేవు. 140 కోట్ల మంది ప్రజలు ప్రజాస్వామ్యాన్ని నమ్ముతున్నారు. త్వరలోనే ఈ దేశ యువత మేల్కొని బ్యాలెట్‌లకు మద్దతుగా ఈవీఎంలకు వ్యతిరేకంగా తమ గొంతు వినిపిస్తారు” అని ఖర్గే పేర్కొన్నారు. భారత్‌పై అమెరికా 26 శాతం సుంకాలను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఖర్గే దీన్ని ప్రస్తావిస్తూ సుంకాలపై పార్లమెంట్‌లో చర్చించాలని తాము పట్టుబట్టినా వారు పట్టించుకోలేదన్నారు. నిరుద్యోగం కారణంగా విదేశాలకు వెళ్తున్న యువతను బంధించి వెనక్కి పంపించడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ప్రధాని మోడీ మౌనంగా ఉండటాన్ని తప్పుబట్టారు. ఈ క్రమం లోనే ఆయన మోడీపై తీవ్ర విమర్శలు చేశారు.

# 2040 నాటికి చంద్రుడిపైకి భారత వ్యోమగామి



2040 నాటికి చంద్రుడిపై భారత వ్యోమగామి కాలు మోపుతాడని, కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ ఆశాభావం వెలిబుచ్చారు. ఓ ఆంగ్లఛానల్ ఏర్పాటు చేసిన 'రైజింగ్ భారత్ సమ్మిట్ 2025' లో ఆయన భారత అంతరిక్ష భవిష్యత్ ప్రణాళికలపై మాట్లాడారు. 2035 నాటికి భారత్ స్వంతంగా అంతరిక్ష కేంద్రాన్ని సమకూర్చుకుంటుందని వెల్లడించారు. చంద్రయాన్ 3 మిషన్‌లో భాగంగా ప్రజ్ఞాన్ రోవర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగడంతో చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన నాలుగో దేశంగా భారత్ అవతరించింది. చంద్రుని దక్షిణ ధ్రువానికి చేరుకున్న తొలి దేశంగా భారత్ రికార్డు సృష్టించింది. చంద్రుడి ఉపరితల నమూనాలను భూమి పైకి తీసుకొచ్చేందుకు భారత అంతరిక్షపరిశోధన సంస్థ (ఇస్రో) 2027లో చంద్రయాన్ 4 ప్రయోగాన్ని చేపట్టనున్నది. చంద్రుడి పైకి భారత వ్యోమగామిని పంపించేంతవరకు చంద్రయాన్ శ్రేణి ప్రయోగాలు కొనసాగుతూనే ఉంటాయని ఇస్రో ఇప్పటికే వెల్లడించింది. ఇక భారత తొలి మానవసహిత అంతరిక్షయాత్ర గగన్‌యాన్‌ను వచ్చే ఏడాది చేపట్టనున్నారు.

## తారక్‌తో సుకుమార్ సినిమా




పుష్ప 2తో పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ కొట్టిన దర్శకుడు సుకుమార్ కొత్త ప్రాజెక్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. 'పెద్ది' సినిమా షూటింగ్ పూర్తయిన తర్వాత రామ్‌చరణ్‌తో సినిమా చేయాల్సివుంది. దీనికోసం ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ కొనసాగిస్తున్నారు. మరోవైపు జూనియర్ ఎన్టీఆర్ (తారక్) 'వార్ 2'లో నటిస్తున్నారు. త్వరలో ప్రశాంత్‌నీల్ ప్రాజెక్టులో చేరుతారు. ఇలాంటి పరిస్థితుల్లో తారక్‌తో సుకుమార్ భేటీపై ఇండస్ట్రీలో చర్చలు కొనసాగుతున్నాయి. సుకుమార్ సతీమణి తబిత ఇన్‌స్టాలో వీరిద్దరూ కలిసి ఉన్న ఫొటోను షేర్‌చేశారు. 'తారక్‌కి ప్రేమతో' అని సుకుమార్ భుజంపై తారక్ వాలి ఉన్న ఫొటోని పోస్ట్‌చేశారు. దీన్ని తారక్ రీపోస్ట్ చేయగా%ా% మళ్లీ దీన్ని సుకుమార్ రీ పోస్టు చేసి 'మై అభిరామ్' అని రాసుకొచ్చారు. గతంలో సుకుమార్..ఎన్టీఆర్‌తో 'నాన్నకు ప్రేమతో' సినిమా తీయగా అది బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. తాజాగా వీరిద్దరు భేటీపై కొత్త ప్రాజెక్టుకు రంగం షురూ అంటూ ఇండస్ట్రీలో చర్చలు కొనసాగుతున్నాయి.



## అభిమానుల ఫ్రస్టేషన్ న్యాయమే కానీ

ది రాజా సాబ్ విషయంలో జరుగుతున్న ఆలస్యం, అప్డేట్స్ లేకుండా కనిపిస్తున్న నిర్లిప్తత ఫ్యాన్స్ ని ఫ్రస్ట్రేట్ చేస్తున్న మాట వాస్తవం. దర్శకుడు మారుతీ తన ఎక్స్ లో పెడుతున్న ట్వీట్స్ కు కామెంట్స్ పెట్టకుండా ఆప్షన్ ఎంచుకోవడం చూస్తే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. నిన్న తత్వం అనే చిన్న సినిమాకు విష్ చేసిన మారుతీ దాని కింద ఎవరూ రెస్పాండ్ కాకుండా చూసుకున్నారు. ఇవాళ పుణ్యక్షేత్రాల సందర్శన సందర్భంగా పెట్టిన ఫోటోలకు ఎలాంటి రిస్ట్రిక్షన్ లేకపోవడంతో యథావిధిగా ఫ్యాన్స్ కామెంట్స్ తో దాడి చేశారు. నిజానికి ఇక్కడ మారుతీ వైపే అన్ని వేళ్ళు లేవు. రకరకాల కారణాలతో రాజా సాబ్ కు బ్రేక్ పడింది.కొంచెం టైం పట్టేలా ఉండటంతో ప్రభాస్ ఫౌజీ వైపు ఎక్కువ దృష్టి పెట్టాడు. అయితే డార్లింగ్ ఫ్యాన్స్ వెర్షన్ వేరేలా ఉంది. రాజా సాబ్ ని ఏప్రిల్ నుంచి వాయిదా వేసుకున్నాక కనీసం ఇంకో రెండు మూడు నెలల్లో రిలీజ్ చేసేలా ప్లాన్ చేసుకోవాలి కానీ ఇలా కాలం వృథా చేస్తూ పోతే ఉన్న బజ్ కూడా తగ్గిపోతుందని ఆందోళన చెందుతున్నారు. అసలు ఈ ఏడాది వస్తుందా రాదానే అనుమానాలు వాళ్లలో బలంగా ఉన్నాయి. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ వైపు నుంచి ఫ్రెష్ గా వాయిదా గురించైనా సరే ఒక అఫీషియల్ అప్డేట్ వస్తే అభిమానుల అసంతృప్తిని కొంత తగ్గించవచ్చు. అసలే ప్రభాస్ లైనప్ చాలా పెద్దది ఉంది. రాజా సాబ్, ఫౌజీ, స్పిరిట్, సలార్ పార్ట్ 2 శౌర్యంగపర్వం, కల్కి 2 ఇలా దర్శకులందరూ క్యూ కట్టి ఉన్నారు. అన్నీ లెక్కేసుకుంటే పేపర్ మీద బడ్జెట్ రెండు వేల కోట్లు దాటిపోతుంది. టయర్ 1 స్టార్ హీరోల్లో వేగంగా ప్యాన్ ఇండియా మూవీస్ చేస్తున్న ప్రభాస్ రిలీజ్ ప్లానింగ్ పరంగా అంతే స్పీడ్ గా లేకపోవడం పట్ల ఫ్యాన్స్ ఆందోళన చెందడం న్యాయమే. ప్రాజెక్టు మొదలుపెట్టినప్పుటి ట్యూన్స్ ఇప్పుడు అవుట్ డేట్ అయ్యాయని, కొత్త పాటలు కంపోజ్ చేస్తున్నానని ఇటీవలే తమన్ చెప్పడం మరో కొసమెరుపు. చెట్టెక్కిన భేతాళుడిలా రాజా సాబ్ ఆగమనం త్వరలో అయితే జరిగేలా లేదు.




## నాగ సాధువుగా తమన్నా అద్భుతమైన నటన

తమన్నా భాటియా హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'ఓదెల 2'లో నెవర్ బిఫోర్ క్యారెక్టర్ లో అలరించడానికి సిద్ధంగా వున్నారు. సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'ఓదెల రైల్వే స్టేషన్'కి సీక్వెల్ ఇది. సంపత్ నంది కథ, స్క్రీన్‌ప్లే, డైలా గ్ రైటర్ గా మల్టిపుల్ రోల్స్‌లో వర్క్ చేశారు. అలాగే డైరెక్షన్ సూపర్ విజన్‌ని అందిస్తున్నారు. అశోక్ తేజ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్ బ్యానర్స్ పై డి.మధు నిర్మిస్తున్నారు. ముంబైలో జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో మేకర్స్ థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. నాగ సా ధువుగా తమన్నా భాటియా అద్భుతమైన నటనతో ఆకట్టుకుంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో హీరోయి న్ తమన్నా మాట్లాడుతూ " సంపత్ నంది ఈ సినిమాలో నా పాత్రని రాసిన విధానం చాలా అద్భుతం గా ఉంటుంది. వశిష్ట సింహ తన అద్భుతమైన నటనతో సినిమాను మరో స్థాయికి తీసుకువెళ్లాడు.

## అదరగొట్టిన 'లెనిన్' గ్లింప్స్...

ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలు అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెం ట్స్ యంగ్ అండ్ డైనమిక్ హీరో అఖిల్ అక్కినేనితో భారీ సినిమాను నిర్మిస్తున్నాయి. 'అఖిల్ 6'ని అక్కినేని నాగార్జున, నాగవంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అక్కినేని అఖిల్ పుట్టినరోజును పురస్కరించుకుని అఖిల్ 6వ చిత్రానికి లెనిన్ అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ప్రకటించారు. మురళీ కిశోర్ అబ్బూరు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. వినరో భాగ్యము విష్ణు కథ చిత్రంతో దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు మురళీకిశోర్ అబ్బూరు. ఇంటెన్స్, యాక్షన్ ప్యాక్డ్ ఎక్స్‌పీరియన్స్ తో రాయలసీమ నేపథ్యంలో రోమాలు నిక్కబొడుచుకునేలా సాగింది లెనిన్ గ్లింప్స్. టైటిల్ గ్లింప్స్ పవర్‌ఫుల్ విజువల్స్‌తో ప్రారంభమైంది. ఆధ్యాత్మిక అంశాలను చొప్పిస్తూ ఆద్యంతం ఆకట్టుకునే ప్రయత్నం చేశారు మేకర్స్. అఖిల్ అక్కినేని%ా% స్టన్నింగ్ లెనిన్ పాత్రకు అద్భుతంగా సరిపోయారు. ఆయన దట్టమైన మీసం, పొడవాటి జుట్టు మ్యాచో అవతార్‌కు పక్కాగా సూట్ అయ్యాయి. అఖిల్ సరసన శ్రీలీల నటిస్తున్న విషయం గ్లింప్స్‌లో తెలియజేశారు. టైటిల్ గ్లింప్స్‌లో మాసివ్ యాక్షన్ మొమెంట్స్, పంచ్ మాత్రమే కాదు పవర్‌ఫుల్ డైలాగ్ కూడా ఆడియన్స్‌ని కట్టిపడేసింది. 'పుట్టేటప్పుడు ఊపిరి ఉంటుంది రా, పేరు ఉండదు. పోయేటప్పుడు ఊపిరి ఉండదు, పేరు మాత్రమే ఉంటుంది' అని రాయలసీమ యాసలో అఖిల్ చెప్పిన డైలాగ్ సింపుల్‌గా అదుర్స్ అంతే. ఒళ్లు గగుర్పొడిచేలా సాగింది లెనిన్ టైటిల్ గ్లింప్స్.



## ఊర్వశి రౌతేలా క్రేజ్.. డాకు మహారాజ్ చిత్రానికి అవార్డ్!

బాలీవుడ్ భామ ఊర్వశి రౌతేలా ఈ ఏడాది డాకు మహారాజ్‌తో టాలీవుడ్ ప్రియులను ?అలరించింది. బాలకృష్ణ హీరోగా నటించిన ఈ సినిమాలో కీలక పాత్ర పోషించింది. అంతేకాకుండా ఈ సినిమాలో దబిడి దిబిడి సాంగ్‌తో ఫ్యాన్స్‌ను మెప్పించింది.  అయితే ఈ పాటపై పెద్దఎత్తున వివాదానికి దారితీసింది. ఈ సాంగ్ కొరియోగ్రఫీపై పలువురు విమర్శలు చేశారు. ఇవన్నీ పక్కన పెడితే తాజాగా బాలీవుడ్ భామను ఓ అవార్డ్ వరించింది. ఫ్యాన్స్ ఫేవరేట్ ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్-2025కు ఎంపికైంది ముద్దుగుమ్మ. డాకు మహారాజ్ చిత్రంలో ప్రదర్శనకు గానూ గోల్డెన్ క్వీన్ అవార్డ్‌ను దక్కించుకుంది. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. అవార్డ్ చేతిలో పట్టుకుని ఉన్న ఫోటోలను షేర్ చేసింది. అంతే కాకుండా తనకు సపోర్ట్ చేస్తున్న అభిమానులకు ధన్యవాదాలు తెలిపింది.

